V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
22-08-2024
సంపుటి : 01 | సంచిక : 110 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మాసెజ్‌లో బుధవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో 18 మంది మరణించారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. అచ్యుతాపురం ఫార్మా సెజ్లోని ఎసెన్షియా అడ్వాన్స్డ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్లో వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారు. భోజన విరామ సమయంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకొని ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పేలుడు ధాటికి పలువురు కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి.



# ఫార్మా సెజ్‌లో పెను ప్రమాదం

## రియాక్టర్ పేలి 18 మంది మృతి, 50 మందికి గాయాలు

### మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం

పేలుడు ధాటికి కూలిన మొదటి అంతస్తు

అచ్యుతాపురంలో ఘటనా స్థలిని పరిశీలించిన హోంమంత్రి, కలెక్టర్

ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం...





**విశ్వంభర, రాంబిల్లి:** అచ్యుతాపురం సెజ్‌లో బుధవారం జరిగిన పేలుడు భయానక వాతావరణాన్ని సృష్టించిది. ఈ పేలుడు కారణంగా 18 మంది మరణించినట్లు చెప్తున్నా ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. పలువురు కార్మికులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు.

మిగతా2లో...

## పోలెండ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ

రెండు రోజుల పాటు కొనసాగనున్న పర్యటన

అధ్యక్షుడు, ప్రధాన మంత్రితో చర్చలు

23న కీవ్ లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ

ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం తిరిగి రావాలని ప్రకటన



**న్యూఢిల్లీ:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం పోలెండ్‌కు చేరుకున్నారు. ఆ దేశ రాజధాని వార్సాలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. భారత్, పోలెండ్ మధ్య ఉన్న దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా మోదీ ప్రస్తుతం అక్కడ పర్యటించారు. అయితే, గత 45 ఏళ్లలో భారత ప్రధాని పోలెండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. 1979లో చివరిసారిగా నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలెండ్‌కు వెళ్లారు.

మిగతా2లో...

## తండ్రే సహజ సంరక్షకుడు



పరిస్థితుల కారణంగా బంధువులకు అప్పగించారు

అంతమాత్రాన సంరక్షణ హక్కును తిరస్కరించలేం: సుప్రీంకోర్టు

2

సెప్టెంబర్ నుంచి

## దేశంలో జనగణన

ఇప్పటికే చైనాను అధిగమించిన భారత్

గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక

కొవిడ్ కారణంగా వాయిదాపడ్డ జనాభా లెక్కల కార్యక్రమం

ప్రధాని కార్యాలయం నుంచి తుది ఆమోదం రావాలి

ప్రభుత్వ వర్గాల వెల్లడి



2



## రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగానికి భూసేకరణ ప్రారంభించండి

ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు

వాటిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్ దక్షిణ భాగానికి వెంటనే భూసేకరణ ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆర్ ఆర్ ఆర్ పురోగతిపై కలెక్టర్లు రోజువారీ సమీక్ష నిర్వహించాలన్న సీఎం, భూసేకరణ స హా ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ఆర్ ఆర్ ఆర్ పురోగతిపై సచివాలయంలో అధికా రులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉత్తరభాగంలో భూసేకరణ, పనుల వివరాలను అధికారులు వివరించారు. ఆర్‌ఆర్‌ఆర్ మొత్తం మ్యాప్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో సీఎం కొన్ని

మిగతా2లో...

## ఓటుకు నోటు కేసులో చంద్రబాబుకు ఊరట



### రాజకీయ కక్షలకు కోర్టులను వేదిక చేసుకోవద్దు..

ఆధార రహిత అంశాలను తీసుకువచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దు

దిల్లీ: ఓటుకు నోటు కేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని, కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన రెండు పిటిషన్లను ధర్మాసనం డిస్మిస్ చేసింది. దాఖలైన రెండు పిటిషన్లను జస్టిస్ సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం విచారించింది. రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా చేర్చుకోవద్దంటూ పిటిషనర్ రామకృష్ణారెడ్డిని జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం మందలించింది. ఆ మేరకు ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

మిగతా2లో...

## ఎస్సీ వర్గీకరణకు అందరి మద్దతూ ఉంది

- ఉమ్మడి సమస్యల పోరుకు కలిసి రావాలి
- మందకృష్ణ మాదిగ పిలుపు

2

బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం

## ఎట్టి పరిస్థితుల్లో జరగదు

సీఎం రేవంత్‌రెడ్డి, కేటీఆర్ బీజేపీ అధికార ప్రతినిధులుగా మారారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 107 | ₹ 129 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 187 | ₹ 213 |

పంచాయతీ ఎన్నికల

## కసరత్తు షురూ

ఓటరు జాబితా తయారీకి షెడ్యూలు ఖరారు

షెడ్యూల్ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలు, పంచాయతీల్లోని వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల

మిగతా9లో...



2

## జన్వాడ ఫాంహౌజ్ కూల్చివేయకుండా స్టే ఇవ్వలేం

60 గజాలైనా, 60 ఎకరాలైనా సరే నిబంధనల ప్రకారం కూల్చివేయాలి: హైకోర్టు

## వైరల్ జ్వరాలతో వణుకుతున్న తెలంగాణ

- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- భారీగా పెరుగుతున్న డెంగీ కేసులు
- హైదరాబాద్ చుట్టుపక్కలే అత్యధికం
- పొంచి ఉన్న మలేరియా, గన్యా ముప్పు
- వాతావరణ మార్పులు... అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితులే కారణం



9

# సెప్టెంబర్ నుంచి దేశంలో జనగణన

**ఢిల్లీ:** దేశంలో సుదీర్ఘ కాలంగా వాయిదా పడుతూ వస్తున్న జనాభా లెక్కల కార్యక్రమం ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. పదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ కార్యక్రమాన్ని 2021లోనే నిర్వహించాల్సి ఉంది. అయితే.. అప్పుడు కొవిడ్ వ్యాప్తి దృష్ట్యా వాయిదా పడింది.అప్పటి నుంచి పలు కారణాలతో జన గణన వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా వచ్చే నెల నుంచి దీన్ని చేపట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్లో ప్రారంభమైతే.. కొత్త సర్వే పూర్తి కావడానికి దాదాపు 18 నెలలు పట్టే అవకాశమున్నట్లు పేర్కొన్నాయి. ప్రధాని కార్యాలయం నుంచి తుది ఆమోదం రావాల్సి ఉందని వెల్లడించాయి. జన గణనను చేపట్టే కేంద్ర హోంశాఖ, కేంద్ర గణాంకాల శాఖలు కాల పరిమితిని నిర్ణయించాయని.. 2026 మార్చి నాటికి 15 సంవత్సరాల డేటాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ అధికారులు తెలిపారు. అయితే.. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, గణాంకాల శాఖ నుంచి ఎటువంటి ధ్రువీకరణ రాలేదు.జనగణన, జాతీయ జనాభా నమోదు ప్రక్రియ కోసం ఈ సారి బడ్జెట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రూ.1,309.46 కోట్లను కేటాయించారు. మూడేళ్ల క్రితం నాటి కేటాయింపులతో పోలిస్తే ఈ మొత్తం తక్కువే. 2021-2022లో జన గణనకు రూ.3,768 కోట్లను ప్రతిపాదించినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు.ఇక జన గణన ఆలస్యంపై పలువురు నిపుణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇతర గణాంక సర్వేల నాణ్యతపై ఇది ప్రభావం చూపిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం చాలా వాటికి 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇక గత ఏడాది ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదిక ప్రకారం.. జనాభా విషయంలో చైనాను భారత్ అధిగమించి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరించింది. 1950లో ఐరాస జనాభా సమాచారాన్ని వెల్లడించడం మొదలు పెట్టిన తర్వాత ప్రపంచ జనాభా జాబితాలో భారత్ తొలిసారిగా ప్రథమ స్థానంలో నిలిచింది.

# తండ్రే సహజ సంరక్షకుడు

**ఢిల్లీ:** తన పిల్లల(మైనర్లు) బాధ్యతలను బంధువులకు అప్పగించినా సరే తండ్రి సహజ సంరక్షకుడిగా ఉండే హక్కును కలిగి ఉంటాడని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. బంధువుల దగ్గర ఉన్న తన కుమార్తెను అప్పగించాలని కోరుతూ ఓ తండ్రి వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. పిల్లలను సంరక్షకుడిగా ఉండే హక్కు తల్లికే కాకుండా తండ్రికి కూడా ఉంటుందని పేర్కొంది.

**'కూతురిని చూసుకునే బాధ్యత తండ్రికి లేదు'..**

కరోనా సమయంలో గౌతమ్ కుమార్ దాస్ దంపతులకు ఆడపిల్ల పుట్టింది. అప్పటికే ఒక కుమారుడు కూడా ఉన్నాడు. ఆడపిల్ల పుట్టిన 10 రోజులకే ఆ శిశువు తల్లి మరణించింది. దీంతో ఆ పిల్లలిద్దరినీ సంరక్షణను అతడి భార్య సోదరీమణులకు అప్పగించాడు. ఆ తర్వాత కొంతకాలానికి అతడు మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. పిల్లలిద్దరినీ తనకు అప్పగించాలని కోరాడు. అయితే వాళ్లు కుమారుడు ఇచ్చి, కుమార్తెను వాళ్లే దగ్గరే ఉంచుకున్నారు. పాపను కూడా ఇవ్వాలని కోరగా దానికి బంధువులు నిరాకరించారు. తమ దగ్గరే ఉంటుందని అన్నారు. దీంతో ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆ అమ్మాయిని చూసుకునే బాధ్యతను ఆ మహిళలకే అప్పగించి, గౌతమ్‌ను కేవలం అప్పుడప్పుడు వెళ్లి చూసుకునే అవకాశం మాత్రం కల్పించింది. ఈ తీర్పును గౌతమ్ సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటషన్ దాఖలు చేశాడు.

**తండ్రికి అప్పగించాలి..**

దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. 'పిటిషనర్ అప్పుడున్న పరిస్థితులు కారణంగా తన పిల్లల సంరక్షణ బాధ్యతను ఆ మహిళలకు అప్పగించాడు. కొంతకాలం వేరే వాళ్లు పిల్లల బాధ్యతలను చూసుకున్నంత మాత్రన తండ్రికి సంరక్షణ హక్కును తిరస్కరించేందుకు కుదరదు. పిటిషనర్ కూడా ఢిల్లీలో ఉంటూ మంచి ఉద్యోగం చేస్తున్నాడు. తన పిల్లలను చదివించే స్తోమత ఉంది. అందుకే అతడి కుమార్తెను తండ్రికి అప్పగించాలి. తొందరగానే తండ్రికి అలవాడు పడుతుంది. అయితే పిల్లలను అప్పుడప్పుడు వచ్చి చూసే హక్కు ఆ మహిళలకు ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది.

# పోలెండ్‌కు చేరుకున్న ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పోలాండ్ అధ్యక్షుడు, ప్రధాన మంత్రితో భేటీ కానున్నారు. పొలాండ్‌కు చెందిన వ్యాపార దిగ్గజాలు, పర్యావరణవేత్తలతోనూ మోదీ చర్చలు జరపనున్నారు. భారత సంతతి ప్రజలను కలవనున్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా జరుగుతన్న ఈ పర్యటన ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సెంట్రల్ యూరప్‌లో పోలాండ్ కీలక ఆర్థిక భాగస్వామి అని తెలిపారు. అయితే పోలెండ్‌లో రెండు రోజులపాటు పర్యటించనున్న మోదీ, అక్కడ నుంచి ఆ తర్వాత ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఆగస్టు 23న ఓ స్పెషల్ ట్రైన్‌లో సుమారు 10 గంటల పాటు ప్రయాణించి కీవ్‌కు చేరుకుంటారు. ఆ తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యి ఆ తర్వాత తిరిగి మళ్లీ రైలులోనే పోలెండ్ చేరుకుంటారు. అక్కడ పర్యటన ముగించుకొన్నాక మోదీ తిరిగి స్వదేశానికి తిరిగొస్తారు.

**'ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నా...**

ఈ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు ."మధ్య ఐరోపాలో భారత్‌కు పోలెండ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఉంది. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పోలెండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ దుడా, ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో నా భేటీ కోసం ఎదురుచూస్తున్నా. అక్కడి భారతీయులతోనూ ముచ్చటిస్తా. ఆ పర్యటనను ముగించుకొని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు కీవ్ వెళ్లనున్నా. ఆ దేశంలో భారత ప్రధాని చేపట్టబోయే తొలి పర్యటన ఇదే కానుంది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడమే ప్రధానాంశంగా ఈ పర్యటన సాగనుంది. గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారంపై జెలెన్‌స్కీతో నా ఆలోచనలు పంచుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. అక్కడ శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగిరావాలని ఆకాంక్షిస్తున్నా" అని ప్రధాని మోదీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఓటుకు నోటు కేసులో చంద్రబాబుకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టులను వాడుకోవద్దని పిటిషనర్ రామకృష్ణారెడ్డిని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆధార రహిత అంశాలను తీసుకువచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దంటూ తీవ్రంగా స్పందించింది. పిటిషనర్ రాజకీయ నేపథ్యంపై ధర్మాసనం ఆరా తీసింది. ఈ సందర్భంగా పిటిషనర్ 2014 నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ ప్రతిపక్షంలో ఉందని సీఎం తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు.కావాలంటే మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని తప్ప రాజకీయ కక్షల కోసం ధర్మాసనం వద్దకు రావొద్దంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటుకు నోటు వ్యవహారంపై సుప్రీంకోర్టులో వేరే కేసులు కూడా ఉన్నాయని రామకృష్ణారెడ్డి తరఫు న్యాయవాది ధర్మాసనం ఎదుట ఓ జాబితా పెట్టారు. ఆ కేసులకు, ఇప్పుడు వాదనలు జరుగుతున్న కేసులకు సంబంధం లేదన్న చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా పేర్కొన్నారు. కేసుల జాబితా చూశాక పిటిషనర్ రామకృష్ణారెడ్డిపై ధర్మాసనం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలు కనపడటం లేదని తెలిపింది.

# ఫార్మా సెజ్‌లో పెను ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

భారీ శబ్దంతో సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఫార్మా సెజ్ లోని అగ్నిమాపక యంత్రం సహా చుట్టుపక్కల నుంచి మరో 11 యంత్రాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. క్షతగాత్రులను చికిత్స కోసం అనకాపల్లిలోని వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. కాలిన గాయాలతో కొందరు మృతి చెందగా, మొదటి అంతస్తు శ్లాబు కింద పడి ఏడుగురు మృతి చెందారు. గాయపడ్డ వారిలో ఐదుగురు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో రెండో షిఫ్టులోని దాదాపు 380 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమలోని మొదటి అంతస్తు శ్లాబు కూలిపోయిందని, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్టు కార్మికులు చెబుతున్నారు. మృతులలో కొంతమందిని గుర్తించారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలిలో సహాయక చర్యలు చేపట్టారు.12 ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

**మృతుల వివరాలు..**

వి. సన్యాసినాయుడు(ప్లాంట్ ఏజీఎం), రామిరెడ్డి(ల్యాబ్ హెడ్), హారిక (కెమిస్ట్) పార్థసారథి (ప్రొడక్షన్ ఆపరేటర్), వై. చిన్నారావు (ప్లాంట్ హెల్పర్) , పి.రాజశేఖర్, మోహన్ (ఆపరేటర్) గణేష్ (ఆపరేటర్), హెచ్. ప్రశాంత్ ,ఎం. నారాయణరావులతో పాటు మరో ఎనిమిదిమంది వివరాలు తెలియాల్సి ఉంది.





**అచ్యుతాపురం ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..**

అచ్యుతాపురం సెజ్ ప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. క్షతగాత్రుల తరలింపునకు అవసరమైతే ఎయిర్ అంబులెన్స్ వాడాలని సూచించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అధికారులను ఆదేశించారు. రియాక్టర్ పేలుడు ఘటన దురదృష్టకరమని కార్మికశాఖ మంత్రి సుభాష్ అన్నారు. భారీగా పొగవల్ల సహాయక చర్యలకు ఆటంకమేర్పడిందని తెలిపారు. ఘటనాస్థలిలో కలెక్టర్, ఎస్పీ పరిస్థితిని సమీక్షిస్తున్నారని, మృతుల వివరాలు తెలిసేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు.

**ఫార్మా కంపెనీలో ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశం...**

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్లోని ఫార్మాకంపెనీలో జరిగిన ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ప్రమాదంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి గురువారం అచ్యుతాపురంలో పర్యటించనున్నారు. ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను, ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించనున్నారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తారు.

ప్రమాద ఘటనపై హెల్త్ సెక్రటరీ, సెక్రటరీ ఇండస్ట్రీస్, డైరెక్టర్ ఫ్యాక్టరీస్, కమిషనర్ లేబర్, డైరెక్టర్ బాయిలర్స్, ఎన్డీఆర్ఎఫ్ సహా జిల్లా ఉన్నతాధికారుతో ఎప్పటికప్పుడు సీఎం మాట్లాడి వారికి సూచనలు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 41 మందికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అవసరమైతే క్షతగాత్రులను విశాఖ లేదా హైదరాబాద్కు ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలించాలని సూచించారు. కార్మికుల ప్రాణాలు కాపాడడానికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# జన్వాడ ఫాంహౌజ్ కూల్చివేయకుండా స్టే ఇవ్వలేం

**విశ్వంభర, హైదరాబాద్:** జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఫాంహౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం, నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధి గురించి చెప్పాలని అదనపు అడ్వకేట్ జనరల్ ను (ఏఏజీ) ధర్మాసనం సూచించింది. హైడ్రా కూల్చివేతలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హై కోర్టు అభిప్రాయపడింది. ఇప్పటి వరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది, ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా? దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలు ఎక్కువ అయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుని హైడ్రా పనిచేస్తుందని వివరించిన ఆయన స్థానిక సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చాకే ఆక్రమణలు కూల్చివేస్తున్నట్లు స్పష్టం చేశారు.ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని, కొట్టివేయాలన్న ఏఏజీ అభ్యర్థించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించారా అని ప్రశ్నించిన హైకోర్టు, 60 గజాలైన, 60 ఎకరాలైనా సరే నిబంధనల ప్రకారమే కూల్చివేయాలని నిర్దేశించింది. జన్వాడలోని ఫామ్‌హౌజ్ విషయంలో నిబంధనలను పాటించాలని హైకోర్టు పేర్కొంది. ఫామ్‌హౌజ్ సంబంధించి అన్ని పత్రాలను పరిగణలోకి తీసుకోవాలన్న హైకోర్టు ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేశారా అని హైకోర్టు అడిగింది. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని హైకోర్టు వెల్లడించింది. ఎఫ్‌టీఎల్ పరిధులను ప్రాథమికంగా నోటిఫై చేశారని ఏఏజీ తెలిపారు.

**అసలు ఏంటీ ఈ కేసు** : జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి అనే వ్యక్తి రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళి పిస్తోంది. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండటంతో కూల్చే అవకాశం ఉందని పిటిషన్‌లో వివరించారు. హైడ్రా కూల్చకుండా స్టే ఇవ్వాలని హైకోర్టులో ప్రదీప్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లో ప్రతివాదులుగా స్టేట్ గవర్నమెంట్, హైడ్రా కమిషనర్ లను చేర్చారు. అలాగే రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులను, శంకర్‌పల్లి రెవెన్యూ ఆఫీసర్, చీఫ్ ఇంజినీర్‌ను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు.

## ఆ ఫాంహౌస్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే నేనే దగ్గరుండి కూల్చేయిస్తా : కేటీఆర్

తన పేరు మీద ఎలాంటి ఫాంహౌజ్ లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మిత్రుడికి చెందిన ఫాంహౌజ్‌ను లీజుకు తీసుకుని ఉంటున్నట్లు వెల్లడించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఫాంహౌస్ ఉంటే తానే దగ్గరుండి కూల్చివేయిస్తానని తెలిపారు. ఒకవేళ తప్పు ఉంటే అక్రమ కట్టడాలు కూల్చివేస్తే తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్న కేటీఆర్ మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందేనన్నారు.కేటీఆర్ ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాల కూల్చివేతలు మంత్రులు, కాంగ్రెస్ నాయకుల నుంచే మొదలు పెట్టాలని బీఆర్ఎస్ నేత కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రులు, పెద్దపెద్ద కాంగ్రెస్ నేతలు అక్రమంగా కట్టిన ఫాంహౌజ్‌లు చూపిస్తానని కేటీఆర్ తెలిపారు. మంత్రి పొంగులేటికి ఎఫ్‌టీఎల్‌లో ఫాంహౌస్ ఉందని ఆరోపించారు. కేవీపీ, పట్నం మహేందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డికి ఎఫ్‌టీఎల్‌లో ఫాంహౌస్ ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫాంహౌస్ ఉన్నట్లు ఆరోపించారు. తప్పు జరిగితే కూల్చివేతకు దగ్గరుండి సహకరిస్తానన్న కేటీఆర్ అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తప్పు తాను చేసినా కాంగ్రెస్ వాళ్లు చేసినా చర్యలు తీసుకోవాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. తన అఫిడవిట్‌లో ఏముందో పబ్లిక్ డాక్యుమెంట్ చూసుకోవచ్చన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రేపు చేవెళ్లలో బీఆర్ఎస్ చేపట్టే నిరసనలో పాల్గొంటానన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు అందరి మద్దతూ ఉంది

**విశ్వంభర, హైదరాబాద్:** అన్ని వర్గాల మద్దతు ఎస్సీ వర్గీకరణకు ఉందని, దాన్ని వ్యతిరేకించడం మానుకొని ఉమ్మడి సమస్యలపై పోరాటానికి కలిసి రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. కోర్టులు, సమాజం, కమిషన్‌లు మాదిగలకు అన్యాయం జరిగినట్లు నిర్ధారించాయన్నారు. రిజర్వేషన్లు అందరికీ అందక అసమానతలు వచ్చాయని అన్ని కమిషన్లు ప్రకటించాయని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "క్రాస్ టాక్ విత్ మంద కృష్ణమాదిగ" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**1998లో అన్ని పార్టీలు మద్దతిచ్చాయి**

1998లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఎస్సీ వర్గీకరణ కోసం తీర్మానం జరిగితే అన్ని పార్టీలు మద్దతిచ్చాయన్న మందకృష్ణ మాదిగ ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. వ్యతిరేకించే కొందరు స్వార్థపరులు తప్ప అందరూ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్‌కు మద్దతు ఇచ్చారని తెలిపారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలో ఏడుగురు న్యాయమూర్తుల బృందం అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, న్యాయం ఇవ్వడంలో జస్టిస్ చంద్రచూడ్‌ను మించిన వారు లేరని కొనియాడారు. అందరి మద్దతు ఉండటంతోనే ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల నిలబడిందని స్పష్టం చేశారు. హర్షకుమార్ లాంటి నేతలకు వారి కులంలోనే విలువ లేదని విమర్శించారు. ఆర్టికల్ 341 ద్వారా పార్లమెంటులో బిల్లు పెట్టమని అంటున్నారని ఆక్షేపించారు. సోనియా, రాహుల్ అందరినీ తాను కలిశానని, బిల్లు పెట్టొద్దని అడ్డం పడ్డది ఆయనే కదా అని ధ్వజమెత్తారు. మాల మేధావులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.



**చంద్రబాబు వల్లే మాకు మేలు జరిగింది:**

వర్గీకరణకు వ్యతిరేకమైతే బయటకు రావాలని మందకృష్ణ కోరారు. వారంతా ముమ్మాటికీ మనువాదులేనని ఆక్షేపించారు. ఎస్సీ వర్గీకరణకు సపోర్టు చేసిన వారికి తన మద్దతు ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి గతంలో జరిగిన ఎన్నికల్లో మద్దతు ఇచ్చామని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు వల్లనే తమకు మేలు జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల కంటే ముందే అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. చట్ట సభలకు వెళ్లి గొంతెత్తాలని ఎవరికైనా ఉంటుందన్న మందకృష్ణ తాను 2004, 2009, 2014లో ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయానన్నారు. ' సీఎం రేవంత్ రెడ్డిని కొంత నమ్ముతా కానీ, మల్లికార్జున ఖర్గేను నమ్మను ...వర్గీకరణకు అడ్డుపడుతుంది ఆయనే' అని మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ ఉపకులాల రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సోనియా, రాహుల్ ఎందుకు స్వాగతించలేదని ప్రశ్నించారు. తెలంగాణలో రేవంత్, కర్ణాటకలో సిద్దరామయ్య స్వాగతించారు. కానీ, ఖర్గే మాత్రం వ్యతిరేకించారని ఆయనను వదిలిపెట్టం. జాతీయ స్థాయిలో చూసుకుంటామని హెచ్చరించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అటార్నీ జనరల్ ద్వారా తమకు అండగా ఉందన్నారు. ఈ తీర్పులో కేంద్రం భాగస్వామ్యం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. మోదీకి మనువాదంతోపాటు మానవతా వాదం కూడా ఉందంటూ కృష్ణమాదిగ కితాబిచ్చారు.

# బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలో విలీనం ఎట్టి పరిస్థితుల్లో జరగదు

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలో విలీనం కాబోతుందంటూ వస్తున్న వార్తలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ బీజేపీ అధికార ప్రతినిధులుగా తయరయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని రేవంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి బీజేపీలో చేరుతారని కేటీఆర్ పరస్పర విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.బీఆర్ఎస్ పార్టీ, బీజేపీలో విలీనం ఎట్టి పరిస్థితుల్లో జరగదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలాగే, నేటి కాంగ్రెస్ పాలన సాగుతోందని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చి, నేడు వాటి అమలులో ఘోరంగా విఫమలయ్యారని ఆయన విమర్శించారు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీయాలని రాష్ట్ర బీజేపీ నేతలకు పిలుపునిచ్చారు.

**కాశ్మీర్‌లో అంబేడ్కర్ రాజ్యాంగం..**

నగరంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యశాలలో పాల్గొన్న కిషన్ రెడ్డి, ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. సెప్టెంబర్ లో జమ్మూ కాశ్మీర్‌లో మూడు దశల్లో పోలింగ్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిన్నా రాజ్యాంగాన్ని, 370 ఆర్టికల్ తొలగించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తీసుకువచ్చామన్నారు. కాంగ్రెస్ పార్టీ మిత్ర పక్షం జమ్మూ కశ్మీర్‌లో అధికారంలోకి వస్తే మళ్లీ 370 ఆర్టికల్‌ను తీసుకువస్తుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ తీసుకువచ్చిన చట్టాలను రద్దు చేస్తామని ఆపార్టీ చెబుతోందని మండిపడ్డారు. జమ్మూ కశ్మీర్ ప్రజలకు బీజేపీ ప్రభుత్వం హక్కులను కల్పించిందని, జమ్మూ కశ్మీర్ లో పర్యాటక రంగం ఊపందుకుందని ఉద్యోగాల కల్పన పెరిగిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం నగరంలో "హైడ్రా" నా "హైడ్రామా" నా అని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అధికారులు అక్రమ నిర్మాణాలకు ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన త్రాగునీరు, కరెంట్ సౌకర్యాలను కల్పించారని, ఏ ప్రాతిపదికన అక్రమ నిర్మాణాల పేరుతో కూల్చుతున్నారో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగానికి భూసేకరణ ప్రారంభించండి

(మొదటి పేజీ తరువాయి)



మార్పులు సూచించారు. ఆ మార్పులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలే లక్ష్యంగా అలైన్‌మెంట్ ఉండాలని, ఆ విషయంలో పారదర్శకంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భూసేకరణ వేగం పెరగాలని ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పరిధిలోని కలెక్టర్లు రోజువారీగా ఏం చేశారు, ఏం పురోగతి సాధించారు, దక్షిణ భాగంలో భూసేకరణ ప్రక్రియ, ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. భూసేకరణలో పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సీఎస్ శాంతికుమారితో పాటు మౌలికవసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ఓఎస్డీ షానవాజ్ ఖాసీం ఆయా జిల్లాల కలెక్టర్లు, రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయాలని చెప్పారు.

ఎప్పటికప్పుడు పనుల పురగోతిని ఆ గ్రూప్‌లో అప్‌డేట్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశం మధ్య పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి-ఆమన్‌గల్-షాద్‌నగర్-చౌటుప్పల్ మార్గానికి సంబంధించి వెంటనే భూ సేకరణ ప్రారంభించాలని పేర్కొన్నారు. ఉత్తర భాగంగా ఇప్పటికే భూ సేకరణ చాలావరకు పూర్తైనందున దక్షిణ భాగంలో ప్రారంభించాలని స్పష్టం చేశారు.సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలి : ఆ రహదారి విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని అదే సమయంలో పనులు ముందుకుసాగాలని సీఎం రేవంత్ సూచించారు.

**ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్ల పైనా..**

ఫ్యూచర్‌సిటీ రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికిముందే ఎక్కడికక్కడ ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలన్న సీఎం, సిగ్నల్ ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ అనుసంధానానికి అనువుగా రేడియల్ రోడ్లు ఉండాలని, ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటు కానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకి ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలకు శంకుస్థాపన

- భూమి పూజలో పాల్గొన్న సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**విశ్వంభర, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో రూ.235 కోట్లతో నిర్మించే నూతన ప్రభుత్వ వైద్య కళాశాలకు రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ వేదమంత్రోచన మధ్య శంఖుస్థాపన చేసి, భూమి పూజలో పాల్గొన్నారు. వైద్య కళాశాల నిర్మాణ నిమిత్తం 30 ఎకరాలలో నిర్మాణాలు చేపట్టేందుకు 235 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేపట్టడం జరిగింది అన్నారు. మంజూరు అయిన నిధులతో ప్రిన్సిపల్, ఆర్ఎంఒ, సూపరింటెంట్ క్వార్టర్లతో పాటు వసతి గృహాలను నిర్మించనున్నారు. ముందుగా కార్యక్రమ ప్రాంగణంలో శాసన సభాపతికి జిల్లా కలెక్టర్ పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. .అనంతరం అనంతగిరి గుట్టలోని తాత్కాలిక భవనాలలో జరుగుతున్న మెడికల్ కాలేజీ తరగతి గదులను, విద్యార్థుల వసతి సౌకర్యాలను స్పీకర్ ప్రసాద్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పి నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్ పర్సన్ శంషాత్ బేగం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ వసంత నాయక్, ఇఇ శ్రీధర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ పద్మ, ఆర్డిఓ వాసు చంద్ర, తాసిల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాగోల్‌లోని శుభంకన్వెన్షన్‌లో బుధవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ద్వితీయ కుమారుడు గౌతంరెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖ సామాజిక వేత్త, వీ3 ఛానల్ సీఎండీ, విశ్వంభర దినపత్రిక సంపాదకుడు కాచం సత్యనారాయణ, దాము మహేందర్‌యాదవ్, శ్రీధర్, కృష్ణారెడ్డి, కాసం ఏకసాయి, విజయ్ తదితరులు

- విశ్వంభర, హైదరాబాద్



గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాంను శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి, దాము మహేందర్ యాదవ్, వంగవీటి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీఆర్ అరుణ్ అంబేద్కర్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కోదుమూరు దయాకర్ రావు, కోదాడ శ్రీనివాస్, విజయ్, నరేష్ తదితరులు.

- విశ్వంభర, హైదరాబాద్





## వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక రిపోర్టర్లు, మార్కెటింగ్ ఏజెంట్స్‌కు

# ముఖ్య గమనిక

మీ వీ3 న్యూస్ రిపోర్టర్లు, విశ్వంభర రిపోర్టర్లు, మార్కెటింగ్ ఏజెంట్స్ అందరికీ ముఖ్య గమనిక ఈనెల 25 ఆదివారం ఉదయం 10.00 గంటలకు వీ3 న్యూస్ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమైన మీటింగ్ జరుగును. కావున ప్రతి ఒక్కరూ మీడియా అక్రిడేషన్ పొందిన రిపోర్టర్లు, పొందని రిపోర్టర్లు, ప్రస్తుతం పని చేస్తున్నటువంటి రిపోర్టర్స్ అందరూ కూడా తప్పనిసరిగా ఈ మీటింగ్ కు హాజరు కాగలరు. మీటింగ్ కు హాజరు కాని ఎడల వారిని రాబోయే మీడియా అక్రిడేషన్ కార్డ్స్ గురించి గానీ ఇతర త్రా వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక సంబంధించి ఉన్న గ్రూప్లో నుండి తొలగించబడును.


# రైస్ మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా

- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, పరిగి:** జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు కదుమూరు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం హైదరాబాద్ లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు రమేష్, శేఖర్, బాలరాజ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన టీజీఎస్ ఆర్టీసీ

- ఒక్కరోజే 63.86 లక్షల మంది ప్రయాణం
- తొలిసారి రూ.32కోట్ల ఆదాయం
- మూడు రోజులు వందశాతం ఆక్యుపెన్సీ
- సంస్థ సిబ్బందికి మంత్రి పొన్నం అభినందనలు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ( టీజీఎస్ఆర్టీసీ) రికార్డు స్థాయిలో సోమవారం ఒక్కరోజే 63.86 లక్షల మంది ప్యాసింజర్లను గమ్యస్థానాలకు చేరవేసిందని ఆర్టీసీ ఉన్నతాధికారులు వెల్లడించారు. మహాలక్ష్మి స్కీం కింద ఒక్కరోజులోనే 41.74 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. మరో 21. 12 లక్షల మంది ప్యాసియర్లు టికెట్లు కొని బస్సుల్లో ప్రయాణించే శారన్నారు. దీంతో ఆర్టీసీకి ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.32 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో మహాలక్ష్మి పథకం ద్వారా రూ.17కోట్లు, నగదుటికెట్ల ద్వారా రూ. 15 కోట్ల ఆదాయం వచ్చినట్టు అధికారు లు తెలిపారు ఆర్టీసీ చరిత్రలోనే ఒక్క రోజులో ఇంత మొత్తంలో ఇన్‌కం రావడం ఇదే మొదటిసారి అని ప్రకటించారు.

పండుగ రోజు భారీ వర్షం కురిసినా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర వేసిన ఆర్టీసీ సిబ్బందిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆర్టీసి మొత్తం సామర్థ్యా న్ని ఉపయోగించుకుందని, ఉద్యోగులు రాత్రి, పగలు క్రమించారని కొనియాడారు. క్షేత్రస్థాయి సిబ్బందితో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని రద్దీ ఉన్న రూట్లలో బస్సులు అదనంగా నడి పించడం వల్లే ఇంత మంది ప్రయాణికులను గమ్యస్థా నాలకు చేరవేయడం సాధ్యమైందన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు. కండక్టర్లకు కూడా ఫీల్డ్ లోనే బస్సుల్లో వారి సొరదీ మణులు రాఖీలు కట్టారని, వారందరికీ అభినందనలు తెలిపారు. మహాలక్ష్మి పథకంద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి చెప్పారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి తమ సోదరులకు రాఖీ కట్టారని, వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

### 92 డిపోల్లో 100% పైగా ఓఆర్: సజ్జనార్



రక్షా బంధన్ రోజు రికార్డ్ స్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ సిబ్బందిని సంస్థ ఎండీ. వీసీ సజ్జనార్ కూడా అభినందించారు. రక్షా బంధన్ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీబస్సులు రికార్డ్ స్థాయిలో 38 లక్షల కిలోమీటర్లు తిరిగాయి. రోజూ యావరేజ్గా 33 లక్షల కి.మీ. తిరుగుతుండగా సోమవారం 5 లక్షల కి.మీ అదనంగా తిరిగాయి. మొత్తం 63 లక్షల మంది ప్రయాణించారు. రీజియన్లవారీగా చూస్తే.. హైదరాబాద్ లో 12.91 లక్షలు. సికింద్రాబాద్ లో 11.68 లక్షలు, కరీంనగర్ లో 6.37 లక్షలు, మహబూబ్ నగర్ లో 5.84 లక్షలు, వరంగల్ 5.82 లక్షల మంది ప్రయాణం చేశారు. 97 డిపోలకుగాను 92 డిపోలు 100శాతానికి పైగా అక్కు పెన్సీ రేషియో (ఓఆర్) నమోదు చేశాయి" అని సజ్జనార్ తెలిపారు.

### 41.74లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం : మంత్రి సీతక్క



రాఖీ పండుగ నాడు మహిళు రికార్డు స్థాయిలో ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని మహిళా. శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.రాఖీ పండుగ సందర్భంగా మొత్తం 41.74లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయగా, వారికీ రూ .17కోట్లు అయ్యిందని తెలిపారు. ఇవి రాఖీ రోజు రేవంత్ సర్కార్ రాష్ట్ర మహిళలకు ఇచ్చిన కానుకగా సీతక్క పేర్కొన్నారు. మహాలక్ష్మీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సమర్థవంతం గా అమలు చేస్తున్నందుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ సిబ్బందిని మంత్రి సీతక్క అభినందించారు.



# అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్

**ఆగస్టు 22... షోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతి**




పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబ్ ఉల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణ ప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీ పరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు.

షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఎ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడయ్యాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండి తనాన్ని ప్రదర్శించాడు.

తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగదంటూ సామాన్యుడు సమరం సాగిస్తున్న సమయమది. అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం.

ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుండి షోయబుల్లా ఖాన్ బయట కొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచు కున్నాడు. చిత్తశుద్ధి, అంకిత భావం, నిబద్దత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు. మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాద కుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలుగా సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుముల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది.

నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించ డానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదను కున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది. బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలక వర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు.

ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండి తనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు.

కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ద పడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగం గానే హెచ్చరించాడు.

1948 అగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకో బోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచి గానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగస్టు 22 న తెల్లవారు జామున తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.

# బ్రిటిషర్లను గడగడలాడించిన తెలుగు బిడ్డ అల్లూరి

## తిరుగుబాటుకు శ్రీకారం చుట్టింది ఈరోజే



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన వ్యక్తి సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మై, చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. 1922 ఆగస్టు 22న మన్యంలో తిరుగు బాటు ప్రారంభం అయింది. రంపచోడవరం ఏజన్సీలోని చింతపల్లి పోలీసు స్టేషనుపై 300 మంది విప్లవ వీరులతో రాజు దాడిచేసి, రికార్డులను చింపివేసి, తుపాకులు, మందుగుండు సామాగ్రిని తీసుకు వెళ్లారు. మొత్తం 11 తుపాకులు, 5 కత్తులు, 1390 తుపాకీ గుళ్ళు, 14 బాయొనెట్లు తీసుకువెళ్ళారు. ఏమేం తీసుకు వెళ్ళారో రికార్డు పుస్తకంలో రాసి, రాజు సంతకం చేశాడు. అదే ఉత్సాహంతో మరుసటి రోజే శరభన్నపాలెం వెళ్ళి, భోజనాలు చేసి ఆ రాత్రే ఆగష్టు 23న - కృష్ణదేవు పేట పోలీసు స్టేషనును ముట్టడించి, ఆయుధాలను తీసుకు వెళ్ళారు. ముందుగా పోలీసులను భయపెట్టి బయటకు పంపేశారు. 7 తుపాకులు, కొన్ని మందుగుండు పెట్టెలు మాత్రం లభించాయి.

ఆగస్టు 24న - వరుసగా మూడవ రోజు - రాజవొమ్మంగి పోలీసు స్టేషనుపై దాడి చేశారు. అయితే ఈసారి పోలీసుల నుండి కొద్దిపాటి ప్రతిఘటన ఎదురైంది. అక్కడ ఆయుధాలు దోచుకోవడమే కాక, అక్కడ బందీగా ఉన్న వీరయ్య దొరను కూడా విడిపించారు. ఈ మూడు దాడులలోను మొత్తం 26 తుపాకులు, 2500కు పైగా మందుగుండు సామాగ్రి వీరికి వశమయ్యాయి. రామరాజు పోరాటంలో అత్యంత సాహసో పేతమైనది అడ్డతీగల పోలీసు స్టేషనుపై అక్టోబర్ 15న జరిపిన దాడి. మొదటి దాడులవలె కాక ముందే సమాచారం ఇచ్చి మరీ చేసిన దాడి ఇది. అక్టోబరు 19న రంపచోడవరం స్టేషనును పట్టపగలే ముట్టడించారు.

4 మాసాల విరామం తర్వాత1923 ఏప్రిల్ 17న రాజు కొద్దిమంది అనుచరులతో అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. రాజు బృందం స్టేషనుకు వెళ్ళారు. విప్లవకారులు 1923 జూన్ 10న ధారకొండ, కొండకంబేరు మీదుగా మల్కనగిరి వెళ్ళి పోలీసు స్టేషను, ట్రెజరీపై దాడి చేసారు .2-9-1923న రామవరం ప్రాంతానికి కమాండర్‌గా ఉన్న అందర్‌వుడ్ సైనికులకు, మన్యం వీరులకు భీకరమైన పోరాటం జరిగింది. సెప్టెంబర్ లో రాజు ముఖ్య అనుచరుడైన గాము మల్లుదొర పోలీసులకు దొరికి పోయాడు. సెప్టెంబరు 22న విప్లవ కారులు పాడేరు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. అక్టోబరు 26న గూడెం సైనిక స్థావరంపై దాడి చేశారు. మన్యం ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో వివరించి, వారికి ఈ బాధల నుండి విముక్తి ప్రసాదించడానికి తాను లొంగి పోవాలని నిశ్చయించు కున్నట్లు చెప్పాడు. తనను ప్రభుత్వానికి పట్టి ఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమతి లభిస్తుందని, కనుక తనను ప్రభుత్వానికి పట్టి ఇమ్మని కోరాడు. కాని తాను అటువంటి నీచమైన పని చేయ జాలనని మునసబు తిరస్కరించాడు. తరువాత,1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపం నుండి, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును (ఒక చెట్టుకు కట్టివేసి) ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపాడు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



# ఆదరణ కరువైన తోలుబొమ్మలాట

**ఆగస్టు 22... ప్రపంచ జానపద కళల దినోత్సవం**





సినిమాలు, టీవీలు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలసి పోయిన పల్లె ప్రజలను జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధాన మైనది.

తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.

ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించ వచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు.

మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది.

చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్ధానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధానమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింపబడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది.

కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకం ఉన్నాయి.

రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు.

ప్రదర్శన సంబంధమైన కదలికలకు అనుగుణంగా ప్రధాన గాయకుడు పాడుతూ వుంటే, మిగిలిన వారు వంతలుగా పాడుతారు. వంతల్లో స్త్రీలు ప్రధానంగా ఉంటారు. రాగం తీయడం, ముక్తాయింపు, సంభాషణ ధోరణిలో స్త్రీగొంతు ముఖ్యపాత్ర వహిస్తుంది. స్త్రీ పాత్రలకు స్త్రీలే పాడతారు.

తోలు బొమ్మలాటలో సామాజిక స్థితిగతులకు దర్పణంగా నిలిపి, పాత్రల ద్వారా సమాజంలో ఉండే దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎండగడతారు. ఇందులో సామెతలు, లోకోక్తులు, పొడుపు కథలు, నీతికథలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. అదేవిధంగా అభినయాలకు స్వభావానుగుణంగా తేల్చడానికి వాద్యానికి సంబంధించి హార్మోనియం, తాళాలు, తొక్కుడుబిళ్ల, మద్దెల, డప్పు, గజ్జెలు వంటివి ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. తోలు బొమ్మల ప్రదర్శనలో రామాయణం, భారతం లకు సంబంధించిన కథా వస్తువులు ఉంటాయి. లంకా దహనం, సతీసులోచన, యయాతి, అంగద రాయబారం, మైరావణ వధ, విరాటపర్వం, పద్మవ్యూహం, ఉత్తర గోగ్రహణం వంటి కథలతో తోలు బొమ్మలను ప్రదర్శిస్తారు. తోలు బొమ్మలు ఆంధ్ర రాష్ట్రంలో ప్రాచీన ఓడరేవులైన కళింగపట్నం, భీమునిపట్నం, కోరంగి, మచిలీపట్నం, వాడరేవు, కొత్తపట్నాల నుంచి విదేశాలకు భారతీయులతో పాటు వెళ్ళాయి. పర్షియా, టర్కీ ల మీదుగా గ్రీసు దేశంలో ప్రవేశించిన తోలుబొమ్మలు, గ్రీసులో నూతన రూపం సంతరించుకుని ఉత్తరాఫ్రికా లోని ముస్లిం దేశాలకు, 17వ శతాబ్దంలో ఇటలీకి, అక్కడినుండి ఫ్రాన్స్ లోని వెర్సయిల్స్, పారిస్, పేలేరాయల్ నగరాలకు వ్యాపించాయి. తోలు బొమ్మలు కాలానుగుణంగా ఆయాదేశాల్లో భిన్నరూపాలు ధరించినప్పటికీ, భారతదేశం వీటికి మాతృక అని చెపుతారు.

తోలుబొమ్మల ఆటలు క్రమేపీ కనుమరుగు కాక తప్పని స్థితి నెలకొంది. తోలు బొమ్మల కళారూపం అంతరించి పోవడానికి గల కారణం నాటకాల ప్రభావం ఉధృతంగా ఉండడం, పద్యనాటకాల ప్రాధాన్యత పెరగడం, నాటకాలలో శాస్త్రీయతకు, సాంకేతిక పరిజ్ఞానానికి ఉన్నతస్థానం లభించడం, సినిమాలు ప్రజలను సమ్మోహితులను చేయడం, తెరపై ప్రేక్షకులకు కావలసినవి అందించడం, అదేవిధంగా ఇంట్లోనే జనరంజకం అన్న నేపథ్యంలో విస్తృతంగా ఛానల్స్ వచ్చి ప్రపంచ తీరు తెన్నులను మార్చడం వంటి ఎన్నో కారణాలు తోలుబొమ్మలు లాంటి కళారూపాల మనుగడకు సవాలుగా నిలిచాయి. ఇలాంటి విషమ పరిస్థితుల్లో, మన ప్రాచీన కళా రూపాల ఆనవాళ్ళు అని చెప్పడానికి వాటిని బతికించు కోవలసిన అవసరం ఎంతైనా అవసరం.

# రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు

- తెలంగాణపై ప్రభావం
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** వాయువ్య బంగాళాఖాతం దానిని అనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమైన వాయుగుండం తెల్లవారుజామున పూరీ, చిలుకా లేక్ మధ్య తీరాన్ని దాటినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. వాయుగుండం పశ్చిమ, వాయువ్య దిశగా కదులుతున్నట్లు తెలిపింది. వాయుగుండం తీరం దాటడంతో ఆ ప్రభావం ఎక్కువగా ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్‌లపైన చూపనున్నట్లు వెల్లడించింది.

### తెలంగాణపై ప్రభావం..

వాయుగుండం ప్రభావం తెలంగాణపైన ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఇవాళ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై సాయంత్రం వరకు నిర్విరామంగా మోస్తరు వర్షం కురవనున్నట్లు చెప్పింది. ఇవాళ్టి నుంచి 24 తేదీల్లో ఈ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

### ఎల్లో హెచ్చరికలు జారీ..

కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఈ జిల్లాలకు యెల్లో హెచ్చరికలను జారీ చేసింది. గంటకు 30 నుంచి 40కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.

### మెదక్ జిల్లాలో భారీవర్షాలు..

మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. గడిచిన 24 గంటలలో జిల్లాలోని చేగుంటలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామంలో గల ఊరు చెరువు కట్టకు గండి పడింది. చెరువు సామర్థ్యానికి మించి నీరు చెరువులోకి రావడం,



కట్ట బలహీనంగా ఉండడంతో గండి పడి నాట్లు వేసిన పొలాల్లోకి నీరు చేరాయి.
మరోవైపు సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరులోని ఇక్రిశాట్‌లో వర్షంతో పాటు ఆకాశం నుంచి చేపలు పడినట్లు స్థానికులు చెబుతున్నారు. అటుగా వెళుతున్న స్థానికులకు చేపలు భూమిపై పాకుతూ కనిపించాయి. వాటిని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అధిక కాస్త వైరల్‌గా మారింది.



## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ జిల్లా పబ్లిక్ వాయిస్ ఫోరం జిల్లా ట్రెజరర్ అరుణ్ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆలంపల్లి జడ్పీ హెచ్ఎస్, వికారాబాద్ జడ్పీ హెచ్ఎస్ బాయ్స్ పాఠశాలల్లో 650 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెంట్రీ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ.. పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా జామెంట్రీ బాక్స్ ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేయడం చాలా సంతోషమని విద్యార్థులకు గుర్తుండేలా కార్యక్రమాలు చేసినందుకు పబ్లిక్ వాయిస్ ఫోరంను అభినందించారు. పుట్టినరోజు జరుపుకుంటున్న అరుణ్ ప్రసాద్‌కి అన్ని విధాలుగా మంచి జరగాలని కోరారు. ఈ సందర్భంగా పబ్లిక్ వాయిస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి యాదగిరి సలహాదారులు రాజు, సభ్యులు హరేందర్, తేజ, మోహన్, భాను, లక్ష్మీనరసింహ, కార్తీక్, సుధాకర్, అరుణ్, మణికంఠ, రాహుల్, అమర్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన



**విశ్వంభర, కాటారం/ భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కస్తూరిబా బాలికల కళాశాలలో కాటారం సీఐ నాగార్జున రావు మత్తు పదార్థాల వినియోగంపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస కాకూడదని మత్తు పదార్థాలు విక్రయించిన, సేవించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మత్తు పదార్థాలపై అవగాహన కలిగించాలని ఆయన కోరారు. డ్రగ్స్ రహిత తెలంగాణ రూపుదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై మాక్స్ స్పీచ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

**భూపాలపల్లిలో..**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణపై కాళేశ్వరం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాళేశ్వరం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళేశ్వరం ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో డ్రగ్స్ పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చక్రపాణి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ , గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల వంటి వాటిని సేవించడం వలన కలిగే అనర్థాలపై వివరించారు. ప్రజలను విద్యార్థులే ముందుండి చైతన్య పరచాలని అన్నారు. డ్రగ్స్, గంజాయిని సేవించిన, విక్రయించిన కేసులు నమోదు చేస్తామని ఎస్సై చక్రపాణి హెచ్చరించారు. విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని చదవాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం, గుట్కా విక్రయదారులపై కేసులు నమోదు

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు గుట్కా, రెండు మద్యం కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు, షాద్ నగర్ ఏసీపీ రంగస్వామి ఉత్తర్వుల ప్రకారం విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్మెంట్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఆమనగల్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు వెంకటేష్, వర ప్రసాద్, శ్రీకాంత్, కృష్ణయ్య సిబ్బంది కలిసి నాలుగు టీములుగా ఏర్పడి కిరాణాషాపులు, దాబాలపై దాడులు చేసి రెండు అక్రమ మద్యం కేసులు, రెండు గుట్కా కేసులను నమోదు చేశారు. ఇక మీదట అక్రమం మద్యం, గుట్కా మరి ఇతర హానికర పదార్థాలు, ప్రభుత్వం నిషేదించిన పదార్థాలు అమ్మినచో చట్టరీత్యా చర్య తీసుకుంటామని సీఐ ప్రమోద్ హెచ్చరించారు.

## పెద్దలను గౌరవించడం మన సంస్కృతి

**విశ్వంభర, భూపాలపల్లి:** ఇంటికి మూల ఆధారం పునాది అయితే కుటుంబ వ్యవస్థకి మూల ఆధారం వృద్ధాప్యంలో వున్న పెద్దవారని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి తెలిపారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక అమృతవర్షిణి అక్షర స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జయరాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న పెద్దవారితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వయోభారంతో వున్న పెద్దమనుషలకు ఓదార్పునిచ్చి వారికి ధైర్యం చెప్పారు. ఒక్కొక్కరుగా వారి మనస్సులోతుల్లోంచి చెప్తున్న బాధలను సావధానంగా విన్నారు. వారికి పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతు పెద్దమనుషులును ఇబ్బందులకు గురిచేయకూడదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీమతి జి. ప్రియాంక, అమృతవర్షిణి అక్షర స్వచ్ఛంధ సేవ సంస్థ వ్యవస్థాపకులు శ్యామ్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



## డయాలసిస్ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



### మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**విశ్వంభర, భూపాలపల్లి:** డయాలసిస్ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇన్ ఫేక్షన్ వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సూచించారు. బుధవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో అమర్చిన పరికరాలు, రోగులకు అందించే సేవలు తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని ప్రాంతంలో డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసి ఏర్పాటు చేసిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం, సీఎంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డయాలసిస్ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇక్కడ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండేలా వైద్యులు సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. డయాలసిస్ కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మంథనిలోనే అందుబాటులోకి రావడం చాలా సంతోషకరమని, అదేవిధంగా మహాదేవపూర్ ఆసుపత్రిలో కూడా ఐదు పడకల డయాలసిస్ కేంద్రం రోగులకు సేవలు అందిస్తుందని మంత్రి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా మన తెలంగాణలో సింగిల్ యూసెజ్ ఫిల్టర్ ద్వారా రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నామని అన్నారు. డయాలసిస్ సేవలు అందుకుంటున్న రోగుల సంఖ్య ఆధారంగా అవసరమైన పరికరాల స్టాక్ ముందస్తుగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమ, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమా నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, మంథని ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలనుండి బీఎస్పీ పార్టీని తరిమి కొట్టండి

**- దశరతం మాదిగ**

విశ్వంభర, నాగర్ కర్నూల్: అణగారిన వర్గాల పార్టీ అనుకున్నాం కానీ అది మన పార్టీ కాదు అగ్రకులాలకి కొమ్ము కాస్తున్న పార్టీ అని తేలిపోయిందని ఎం.ఆర్.పీ.ఎస్ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్యక్షులు కరిగల్ల దశరతం మాదిగ అన్నారు. ఇప్పటికైనా మాదిగలు బీఎస్పీలో టే వెంటనే రాజీనామా చేయలని కోరారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సరియైనది కాదని బీఎస్పీ పార్టీ నిరూపించగలదా, ఎప్పుడు నిరూపిస్తరో చెప్పగలరా అని దశరతం మాదిగ ప్రశ్నించారు. మాదిగ



బిడ్డలు బీఎస్పీ పార్టీలో ఉంటే తక్షణమే పార్టీకి రాజీనామ చేసి ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉండాలని సూచించారు. మాలలకు ఒత్తసు పలుకుతూ బీఎస్పీ పార్టీ మాయలో పడి మాదిగ జాతికి ద్రోహులుగా కాకుండా మాదిగల పక్షాన నిలవాలని తెలిపారు. మాదిగల భవిష్యత్తు కోసం 30 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణమాదిగ పట్టుదలతో ఎస్సీ వర్గీకరణ సాధించాడని, ఉద్యమంలో ఎంతో మంది మాదిగ బిడ్డలు అమరులైనారని, వారి పోరాట త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ జరిగిందని గుర్తు చేశారు. మనం పుట్టిన తల్లిని మనం పెరిగిన ప్రాంతాన్ని ఎప్పుడు మర్చిపోవద్దని అన్నారు. మాదిగలకు ఏ ఒక్క చిన్న పని చేయని బీఎస్పీ పార్టీని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ పట్టణంలో ఉన్న పానీపూరి బండ్లపై దాడులు నిర్వహించి నాణ్యత ప్రమాణాలు పాటించని వారిపై 5000 జరిమానా విధించారు. కమీషనర్ మోహన్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పానీ పూరి మాస్టర్ చేతులకు గ్లౌజులు, తలకు టోపీ, మాస్క్ తప్పకుండా ధరించి ఉండాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, మినరల్ వాటర్ వాడాలని తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్యం దృష్ట్య నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చుట్టూ ఉన్న పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నచో రోజువారి దాడులు నిర్వహించి జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్విరానెమెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, నాయక్, అశోక్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ సర్పంచ్ భరోసా

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ గ్రామానికి చెందిన తల్లోజు బాలచారి అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన గురిగళ్ళ పెంటయ్యను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు నేనున్నానని, పదవులు ఉన్న లేకున్నా ప్రజాసంక్షేమే తన ధ్యేయమని, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగల్ పల్లి నరసింహ, తల్లోజు వేణు, మూడ రవి, ఇర్షాద్, కొప్పు కృష్ణ పాల్గొన్నారు.





## కడ్తాల్ మేడికుంటకు తాత్కాలిక మరమ్మతులు

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల మండల కేంద్రంలో గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మేడికుంటకు గండిపడటంతో భారీగా వర్షం నీరు వృధా అయ్యింది. స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మేడికుంటను పరిశీలించి జేసీబీ సహాయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. గ్రామాలలో ఉన్న చెరువులు కుంటలలో నీరు నిల్వ ఉంటేనే వ్యవసాయ బావులలో నీరు సమృద్ధిగా ఉంటుందని, గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత పునరుద్ధరణ కార్యక్రమంతో భూగర్భ జలాలు పెరిగిపోయాయని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు కట్టలపై ఉన్న కంపచెట్ల తొలగింపు కార్యక్రమాలు కూడా చేపట్టాలని అధికారులను మాజీ సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, సిద్ది గారి వెంకటేష్, కంబాల శ్రీకాంత్, శ్రీశైలం, ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ ఎల్లయ్య, కృష్ణ, నరసింహ, శ్రీశైలం పాల్గొన్నారు.

## కారుణ్య నియామక పత్రాల అందజేత



**విశ్వంభర, భూపాలపల్లి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భూపాలపల్లి ఏరియా సింగరేణి ఎక్స్ ఎంప్లాయిస్ డిపెండెంట్లకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈరోజు సాయంత్రం సింగరేణి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 14 మంది డిపెండెంట్లకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. అదేవిధంగా, వివిధ కారణాలతో మరో నలుగురు డిస్మిస్ కాగా, వారిని కూడా తిరిగి విధుల్లోకి తీసుకోడానికి నియామక ఉత్తర్వు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం సయ్యద్ అబీబ్ హుస్సేన్, ఎస్ ఓ టు జీఎం వెంకటరామిరెడ్డి, పర్సనల్ మేనేజర్ మారుతి ఉన్నారు.

## కట్ట మైసమ్మ ఆలయంలో అంకురార్పణ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల కేంద్రంలోని సురసముద్ర చెరువు కట్టపై కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మొదటి రోజు గంగా మాత, నాగ రాజు, గణపతి పూజలు, సర్వదో భద్రా ఆహ్వానాది పూజలు, క్రతువులు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి 108 కళశాలతో విశేష అభిషేకములు బ్రాహ్మణోత్తములచే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ముక్తాల వెంకటయ్య మాజీ ఎంపీపీ తల్లోజు వెంకటయ్య దంపతులు, సంఘ సేవకులు పాపిశెట్టి రాము దంపతులు, చిన్న వెంకటయ్య, కేకే, శీను, రాజు, రఘు, లైన్మెన్ హనుమంతు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాజీ జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, నార్కెట్ పల్లి:** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ, మాజీ జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రేగట్టే మల్లి కార్జున రెడ్డి జన్మదిన వేడుకలు నార్కెట్ పల్లి పట్టణంలోని నల్గొండ చౌరస్తా లో బీఆర్ఎస్ నాయకులు, అభిమానుల ఆనందోత్సహాల మధ్య ఘనంగా నిర్వహించారు. చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో మొదట బాణాసంచా కాల్చి అనంతరం కేక్ కట్ చేసి తమ అభిమాన నాయకునికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పుల్లెంల ముత్తయ్య, శాపల్లి మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, చిన్న నానపురం మాజీ సర్పంచ్ నర్సింహా యాదవ్, నార్కెట్ పల్లి మాజీ సర్పంచ్ బాణాల భాస్కర్ రెడ్డి, రామలింగం, రవిచంద్ర పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్యా విధానం కొరకు

# విద్యార్థులు ఉద్యమించాలి

**విశ్వంభర, చింతపల్లి:** ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాల సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవాల వేడుకలకు ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు హాజరై ఏఐఎస్ఎఫ్ జండాను ఆవిష్కరించి అనంతరం అయన మాట్లాడారు. త్యాగాలు, పోరాటాలే ధ్యేయంగా అఖిల భారత విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందని, శాస్త్రీయ విద్య విధానం అమలు, విద్యా కాషాయకరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ పోరాడుతుందని అనారు. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో, కార్పొరేట్ విద్య వ్యవస్థ పాలకుల అనాలోచిత సంస్కరణపై మరో పోరాటానికి విద్యార్థులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్యం మా జన్మ హక్కు అంటూ స్వాతంత్యం కోసం జరిగిన సంగ్రా



మంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్ లక్నో నగరంలో ఏర్పాటు కాబడి నేటికీ 88సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ వసంతాలు అడిగిపెట్టి సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. మెకాలే విద్యా విధానం మాకొద్దంటూ విద్య రంగంలో సంస్కరణ కోసం పోరాడి కొఠారి కమిషన్ సిఫారసుల అమలు చేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్ దే అన్నారు. ధరలు అనుగుణంగా మేస్కార్షిలు స్కాలర్షిప్స్ పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులకు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిందన్నారు. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికి పుచ్చుకొని పోరాడాలన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ పోరాటం చారిత్రాత్మకమైనది అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తూ జాతీయ నూతన విద్యా విధానం పేరుతో విద్యా విధానాన్ని ధ్వంసం చేసే కుట్రలను తిప్పికొడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి షేక్ శంశోద్దీన్, చింతపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు వలపోజు శివ, కాటేపాక మహేష్, నాయకులు ఎండి జావీద్, ప్రవీణ్, నావజ్, అనస్ ఆఫన్, విజయ్, శివ శంకర్, వరప్రసాద్, శివ, సిద్దు, రవి, జయ, మానస, అక్షయ, శిరీష, ఉమామహేష్ పాల్గొన్నారు.



## కాన్సర్ రోగికి ఆర్థిక సాయం

**విశ్వంభర, భూదాన్ పోచంపల్లి :** క్యాన్సర్ వ్యాధితో భాదపడుతున్న కర్నాటి నర్సింహస్వామికి భూదాన్ పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ఆర్థిక సహాయాన్ని అందజేసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకొని త్వరగా కోలుకోవాలని, కుటుంభానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ యువసేన, టై & డై ఉపాధ్యక్షులు కుడికాల రామనర్సింహ, ఏకేఎల్ బి అధ్యక్షులు గుండు శ్రీరాములు, గుండు ఉప్పలయ్య, అంకం పాండు, బోగ నర్సింహ, వలందాస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా మధు యాదవ్



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలం నెల్వలపల్లి గ్రామానికి చెందిన గొడ్డటి మధు యాదవ్ ఆర్ఎస్ఎస్ భావజాలంతో వుంటూ బీజేవైఎం దేవరకొండ నియోజకవర్గ కో కన్వీనర్ గా చేస్తూ ఈ నెల 20న బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కావడం జరిగింది. తన ఎన్నికకు సహకరించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెల్ల మహేందర్, బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు సహకరించిన బీజేపీ నాయకత్వానికి గొడ్డటి మధు యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పేర్ల గణేష్



**విశ్వంభర, చండూర్ :** భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చండూరు చెందిన పేర్ల గణేష్ ను రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ నియమించారు. తన నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి కి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ రెడ్డి, బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, బీజేవైఎం నల్గొండ జిల్లా అధ్యక్షులు వంగూరి రాఖీ , బిజెపి నల్గొండ ఉపాధ్యక్షులు సోమ నరసింహ, బిజెపి నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనం వేణు కుమార్ , ఓబిసి రాష్ట్ర నాయకులు కోమటి వీరేశం, బిజెపి పట్టణ అధ్యక్షులు పందుల సత్యం , భూతరాజు శ్రీహరి లకు గణేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

## 23న ముసాయిదా చట్టంపై అవగాహన సదస్సు

**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముసాయిదా ఆర్ఓఆర్ చట్టం 2024 అమలుపై ఈ నెల 23న సాయంత్రం 3 గంటలకు ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో ప్రజా ప్రతినిధులు, న్యాయ వాదులు, విద్యావేత్తలు, రైతులు, రైతుసంఘాలు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, అవగాహన ఉన్న ఇతర వ్యక్తులతో చర్చా వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆర్.ఓ.ఆర్ ముసాయిదా చట్టం 2024 అమలుకు ఆయా వర్గాల నుండి తగు సూచనలు సలహాలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## చేనేత కార్మికుడి ఆత్మహత్య



**విశ్వంభర, చండూరు :** ఆర్థిక ఇబ్బందులు తాళలేక చేనేత కార్మికుడు పులిపాటి అంజయ్య (59) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నల్గొండ జిల్లా,చండూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వృత్తిరీత్యా అంజయ్య చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. చేనేత కార్మికులు నేసిన చీరలకు గిరాకీలు లేక ఓ వైపు ఎంత కష్టపడ్డా శ్రమకు తగిన ఫలితం లేకపోవడం, మరో వైపు కుటుంబ పోషణ భారంగా మారడంతో, ఇద్దరి ఆడ పిల్లల పెళ్ళిళ్ళు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. చేనేత కార్మికుడి మృతికి పలు చేనేత కార్మిక సంఘాలు, పద్మశాలి సంఘాలు సంతాపం వ్యక్తం చేస్తూ.. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని, చనిపోయిన మృతుడికి 25 లక్షల ఎక్స్ గ్రేసీయా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## హింసకు కారణాలను సమూలంగా తొలగించాలి




**విశ్వంభర, బషీర్ బాగ్:** సమాజంలో పెరుగుతున్న హింసకు కారణాలను సమూలంగా తొలగిస్తే తప్ప ఈ అత్యాచారం పర్వం ఆగదని ఫలక్ నుమా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫలక్నామాలో బెంగాల్ ఆర్ జీ కార్ ఆసుపత్రిలో అత్యాచారానికి బలై మరణించిన వైద్య విద్యార్థికి శ్రద్ధాంజలి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ ఘటనలో పాల్గొన్న నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సంఘటన సర్వ సమాజం తరలించుకునేదని ఎంతో ఆవేదనకు గురిచేసిందని అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్ శశికళ మాట్లాడుతూ ఈ ఘటనకు కారకులైన దోషులను ప్రత్యేక కోర్ట్ ఏర్పాటు చేసి కఠినంగా శిక్షించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు సామాజిక బాధ్యతలను నేర్పాలని, ఆడపిల్లలకు యుద్ధ విద్యలు శిక్షణ ఇప్పించాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ పాతబస్తీ అధ్యక్షులు ఎస్ రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన ప్రతి ఒక్కరిని హృదయాలను కలచివేసిందని, ఇలాంటి ఘటనలతో వైద్యుల్లో ఆ భద్రతాభావంతో పాటు ఆత్మశైర్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం విచ్చేశారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ చీఫ్ కోఆర్డినేటర్ ముత్యం యాదవ్ మాట్లాడుతూ రోజు రోజుకు మహిళలపై చిన్న పిల్లలపై లైంగిక దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వాలు నిందితులకు తొందరగా గుర్తించి కఠిన శిక్షలు అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా యువత మత్తు, మద్యం, డ్రగ్స్ అలవాటు పడి సైకోలుగా మారి ఇలాంటి ఘటనలు అధికంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ డాక్టర్ డేవిడ్, డాక్టర్ గంగాధర్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్ తో పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కాండీల్స్, ప్లకార్డులు ద్వారా శ్రద్ధాంజలి ఘటించి ఆమె ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## నేషనల్ హైవే భూసేకరణలో వేగం పెంచాలి

### ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాసరి హరి చందన



**విశ్వంభర, భూపాలపల్లి:** నేషనల్ హైవే భూసేకరణలో వేగం పెంచాలని ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాసరి హరి చందన అన్నారు. బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులను సంబంధించి భూసేకరణ పనుల పురోగతి గురించి సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో ఆర్ అండ్ డీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాసరి హరి చందన మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైతులతో మాట్లాడి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణకు జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని 14 గ్రామాల రైతులకు సంబంధించిన 130.5 హెక్టార్ల విస్తీర్ణం అవసరం ఉందని, భూసేకరణ జరుపుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు భూసేకరణకు సంబంధించి రైతులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించడం జరిగిందని రిజిస్ట్రేషన్ ధరకు రెండు రెట్లు ఎక్కువ ఇవ్వడానికి అవార్డు జారీ చేస్తే రైతులు ఒప్పుకోలేదని రైతులతో నిర్వహించిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కూడా పాల్గొని రైతులకు న్యాయం చేయాలని కోరారని పేర్కొన్నారు. మరొకసారి రైతులతో సమావేశం నిర్వహించి భూసేకరణ పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ వసంత, ఆర్డీఓ మంగిలాల్ పాల్గొన్నారు.

## వర్షా కాలం వ్యాధుల పట్ల ప్రజలు అలర్ట్ గా ఉండాలి

**విశ్వంభర, తలకొండపల్లి:** వర్షాకాలం దోమల ద్వారా వ్యాపించే రోగాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పల వెంకటేష్ అన్నారు. కామినేని హాస్పిటల్ సౌజన్యంతో తన ట్రస్టు ద్వారా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉప్పల వెంకటేష్, సీ ఎల్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 461 మంది రోగులకు జనరల్ బీపీ, షుగర్ పరీక్షలు, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన రోగులకు మందులు అందజేయడమే కాకుండా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవాలని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం నెల రోజులపాటు మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతుందని మండల ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కో ఆప్షన్ మెంబర్ ముజిబుర్ రహ్మాన్, గ్రామ మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మాజీ ఎంపీటీసీ అంబాజీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కోన రవికుమార్, సింగిల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్ యాదవ్, నరేందర్ బుచ్చిబాబు వైద్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## డిండిలో బంద్ సంపూర్ణం



**విశ్వంభర, డిండి:** భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ఎస్సీ ఎస్టీ సంఘాల పిలుపు మేరకు భారత్ బంద్ లో భాగంగా డిండి మండల కేంద్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ సంపూర్ణంగా పాటించాయి. ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ కు మద్దతుగా మాల మహానాడు ఆధ్వర్యంలో డిండి మండల కేంద్రంలో బందు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు అవుట మల్లేష్, మాల మహానాడు మండల నాయకులు నూనె ప్రసన్నకుమార్, గోరేటి వెంకటేష్, నూనె మాధవ్, నూనె రజినీకాంత్ పాల్గొన్నారు.



## ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి నియోజకవర్గ పరిధి మోరంచపల్లి గ్రామం కొత్తపల్లి రోడ్డులో ముకిరాల తిరుపతిరావు నూతనంగా ఏర్పాటు చేసిన విజయ బాలాజీ గార్డెన్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై ఫంక్షన్ హాల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ సంపత్ రావు, నరెడ్ల తిరుపతిరెడ్డి, ముకిరాల మధు వంశీకృష్ణ, ఒద్దుల విజయ అశోక్ రెడ్డి, భూపాలపల్లి రూరల్ మండల అధ్యక్షులు సుంకరి రామచంద్రయ్య, నూకల నరసింహారెడ్డి, పైడిపల్లి రమేష్, సుక్క రమేష్, వెంకట్ స్వామి, రామినేని రవీందర్, అంబాల శ్రీనివాస్, నలిమెల సదయ్య, సోషల్ మీడియా ఇన్చార్జి జోడు ప్రదీప్ ముదిరాజ్, సాయి చరణ్, తోట రంజిత్, పోలుసాని కోటేశ్వరరావు, భాస్కర్ హాజరయ్యారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన



**విశ్వంభర, చివ్వెంల :** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్థానిక సంస్థలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్లాట్ యజమానులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్, ఎంపీ ఓ దయాకర్, ఇరిగేషన్ ఏఈ రవి కిరణ్, ఆర్ఐలు శ్రావణి, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి విక్రం, పాల్గొన్నారు.

## ఈనెల 23, 24 న ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు

**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల స్థాయి క్రీడా పోటీలను జడ్పీహెచ్ఎస్ కుర్మపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్జీఎఫ్ మండల స్థాయి పోటీలను ఈనెల 23, 24 తేదీలలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులందరికి భోజనం, వారికి కావలసిన అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నామని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ పాల్గొని తమ ప్రతిభను కనపరచవలసిందిగా కోరారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను దేవరకొండ డివిజన్ స్థాయి టోర్నమెంట్స్ కి సెలెక్ట్ చేస్తామని తెలిపారు.

## బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా దయాకర్



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం అధికార ప్రతినిధిగా ఒక్కంటి దయాకర్ నియమితులయ్యారు. నియోజక వర్గం అధికార ప్రతినిధిగా తనను నియమించడం ఎంతో ఆనందంగా ఉందని దయాకర్ అన్నారు. బీజేపీ పార్టీ కోసం తాను నిత్యం పని చేయడానికి ముందు ఉంటాను అన్నారు. నాపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, అదేవిధంగా రాబోయే కాలంలో బీజేపీ పార్టీలో అందర్నీ కలుపుకొని కార్యక్రమాలు కొనసాగిస్తానని, నా నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి, సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, గరికపాటి మోహన్ రావు, రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్ల మహేందర్, కుమార్ యాదవ్, యువమోర్చా ప్రభారి కాసం వెంకటేశ్వర్లు, యాదవ్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎస్ మల్లారెడ్డి, తదితరులకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## మత్తు పదార్థాలపై పోలీసుల అవగాహన

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది గంజాయి, మత్తు పదార్థాల అనర్థాలపై జిల్లా పరిధిలోని కళాశాల, పాఠశాలల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెడు వ్యసనాలకు అలవాటు పడిన వారిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మత్తు పదార్థాల బారి నుంచి కాపాడవచ్చన్నారు. మత్తు పదార్థాల వినియోగం సామాజిక సమస్యగా పరిగణించబడుతోందని, ఈ సమస్యను రూపుమాపడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. గంజాయి లేదా మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం లాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## కౌన్సిలర్‌కు శ్రద్ధాంజలి

**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ రణవేణి సుజాత సత్యనారాయణ అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. 14వ వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య అకాల మరణం చెందినందుకు పాలకవర్గం, ఉద్యోగస్తులు రెండు నిమిషాలు మౌనం పాటించి వారి ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. చైర్పర్సన్ సుజాత సత్యనారాయణ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. అందరితో కలివిడిగా ఉండే మర్రి పోచయ్య చేపల మార్కెట్ నిర్మాణానికి ఎంతో కృషి చేశారు. ఆయన మా నుండి దూరం అవడం చాలా బాధాకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర రావు, మున్సిపల్ కమిషనర్ టీ మోహన్, డీఈ నాగేశ్వరరావు కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఒక కత్తెర వల్ల 36 విమానాలు ఆలస్యం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** విమానాలు రకరకాల కారణాల వల్ల రద్దు అవుతూ ఉంటాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తూ ఉంటాయి. ఒక నగరం నుంచి మరో నగరానికి.. ఒక దేశం నుంచి మరో దేశానికి వేగంగా వెళ్లేందుకు ప్రజలు.. ఈ విమానాలను ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే కొన్ని సందర్భాల్లో విమానాలు క్యాన్సిల్ కావడం, ఆలస్యం కావడంతో.. వారి పనులకు ఆటంకం కలుగుతుంది. వాతావరణం సహకరించకపోవడం, విమానాల్లో సాంకేతిక లోపం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి అనుమతి రాకపోవడం వల్ల సాధారణంగా విమానాలు రద్దు కానీ, ఆలస్యం కానీ అవుతాయి. అయితే ఇక్కడ మాత్రం ఒక కత్తెర కారణంగా విమానాలు రద్దు, ఆలస్యం కావడం తీవ్ర చర్చకు దారి తీసింది.

జపాన్‌లోనే అత్యంత రద్దీగా ఉండే న్యూ చిటోస్ ఎయిర్‌పోర్టులో ఈ సంఘటన చోటు చేసుకుంది. హక్కైడో ద్వీపంలో ఉన్న ఈ న్యూ చిటోస్ విమానాశ్రయంలో ఉన్న ఓ రిటైల్ స్టోర్‌లో ఉన్న ఓ కత్తెర ఆగస్ట్ 17 వ తేదీన కనిపించకుండా పోయింది. దీంతో ఆ రిటైల్ స్టోర్ యజమాని.. ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అలర్ట్ అయిన ఎయిర్‌పోర్టు అధికారులు.. ప్రయాణికులను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఎయిర్‌పోర్టు మొత్తం ఆ కత్తెర కోసం జల్లెడ పట్టారు. విమానాలు ఎక్కేందుకు ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రయాణికుల భద్రతా తనిఖీలను ఆపేసి మరీ.. దాదాపు 2 గంటల పాటు ఆ కత్తెర కోసం అణువణువునా గాలింపు చేపట్టారు. దీంతో ఆ ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లాల్సిన 36 విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. అదే సమయంలో మరో 201 విమానాలు.. షెడ్యూల్ కంటే ఆలస్యంగా బయల్దేరాయి.

ఈ క్రమంలోనే ఈ ఘటనపై న్యూ చిటోస్ ఎయిర్‌పోర్టు అధికారులు స్పందించారు. ఎయిర్‌పోర్టులోని రిటైల్ స్టోర్‌లో కత్తెర కనిపించకుండా పోవడంతో.. ప్రయాణికుల భద్రత నేపథ్యంలోనే ఎయిర్‌పోర్టు మొత్తం ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా ఉగ్రవాదులు.. ఆ కత్తెరను ఎత్తుకెళ్లి.. దానితో బెదిరించి.. విమానాలను హైజాక్ చేసే అవకాశాలు ఉన్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈ సంఘటనలో అసలు ట్విస్ట్ ఏంటంటే.. కనిపించకుండా పోయిన ఆ కత్తెర చివరకు.. అదే రిటైల్ స్టోర్ కనిపించింది. ఈ నేపథ్యంలోనే ఆ రిటైల్ స్టోర్‌లో మేనేజ్‌మెంట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే ఇలాంటి ఘటన జరిగిందని.. ఎయిర్‌పోర్టు అధికారులు చివరికి తేల్చారు.






అయితే, ఈ విషయం తెలుసుకుని ఆ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికులు అవాక్కయ్యారు. ఈ ఘటన కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విమానాలు ఆలస్యం కావడంతో చాలా మంది ప్రయాణికులు గంటల తరబడి అదే న్యూ చిటోస్ ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇక కొందరు ప్రయాణికులు.. చేసేదేం లేక తిరిగి వెళ్లిపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఎయిర్‌పోర్టు అధికారులకు జపాన్ రవాణా మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. 1988లో ప్రారంభం అయిన ఈ న్యూ చిటోస్ ఎయిర్‌పోర్ట్.. హక్కైడో ద్వీపంలోనే అతిపెద్దది కావడం గమనార్హం. జపాన్‌లో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఇది ఒకటి. ఈ ఎయిర్‌పోర్టులో భద్రతాపరంగా కఠినమైన ప్రొటోకాల్స్ ఉంటాయి.




### తెలుగు తేజానికి

## ఐఐటీ న్యూఢిల్లీ డాక్టరేట్

### ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్న టీవీఎస్ఎన్ ప్రసాద్

**విశ్వంభర, హైదరాబాద్:** హర్యానా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విశేష సేవలందిస్తున్న తెలుగు వ్యక్తి టీవీఎస్ఎన్ ప్రసాద్ కు ఐఐటీ న్యూఢిల్లీ డాక్టరేట్ వరించింది. ఆర్థికశాస్త్రంలో ఆయన రాసిన పరిశోధన పత్రానికి ఐఐటీ న్యూఢిల్లీ డాక్టరేట్ అందించింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిగా ప్రస్తానాన్ని ప్రారంభించిన ప్రసాద్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. వరల్డ్ బ్యాంక్‌లో ఏడేళ్ల పాటు పని చేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ అర్థిక నిపుణులుగా పేరు తెచ్చుకున్నారు. ఐఏఎస్ అధికారిగా హర్యానా క్యాడర్‌లో ఫైనాన్స్ సెక్రటరీగా ఆ రాష్ట్ర ఆర్థిక సంస్కరణలలో కీలక పాత్ర పోషించారు. సెంట్రల్ సర్వీస్‌లో నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ ప్రాజెక్ట్ హెడ్‌గా పని చేసి పర్యావరణం, నీటి వనరుల నిర్వహణలో కీలక భూమిక పోషించారు. ఎకనామిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ రంగాల్లో పని చేసి టీవీఎస్ఎన్ ప్రసాద్ అత్యున్నత ప్రతిభను చాటారు. ఆయన రాసిన అనేక వ్యాసాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమైయ్యాయి. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పూర్వవిద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

### ప్రభుత్వ పాఠశాలపై ప్రజా ప్రతినిధులు కన్ను విశ్వంభరలో వచ్చిన వార్తకు

## చైర్మన్ వివరణ

**విశ్వంభర, ఘట్కేసర్:** ప్రభుత్వ పాఠశాలపై ప్రజా ప్రతినిధుల కన్ను విశ్వంభర పత్రికలో వచ్చిన శీర్షికకు బుధవారం పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి వివరణ ఇచ్చాడు. ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న ఖాళీ స్థలం కొన్ని సంవత్సరాల నుండి కబ్జాలకు గురికాకుండా, ముందు జాగ్రత్త కై ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వారు పడే ఇబ్బందులను తల్లిదండ్రులు చూసి మా దృష్టికి తీసుకురావడం జరిగింది. గ్రామంలోని పెద్దల అభ్యర్థన మేరకు విద్యార్థులకు అనుకూలంగా పాఠశాల పక్కనే ఉన్న కొంత ఖాళీ స్థలంలో దాతల సహకారంతో అదనపు తరగతులు నిర్మించడానికి అందరి దాతల సహకారంతో భవన నిర్మాణం చేపడితే, కొందరు స్వార్థపరులు అడ్డుకుంటున్నారని, భవన నిర్మాణం కొరకు జిల్లా అదనపు కలెక్టర్ ని, జిల్లా విద్యాధికారిని కలిసి అనుమతులు తీసుకున్నామని ఆయన అన్నారు. మా స్వార్థం కోసం, మేము భవనాన్ని నిర్మించుకోవడంలేదని, ప్రజలను దృష్టిలో పెట్టుకొని పెద్దల సహకారంతో ఈ పనిని చేపట్టామని, తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదని, చైర్మన్ కొండల్ రెడ్డి సమాధానం ఇచ్చారు.



## కూల్చాలి అంటూనే .. కోర్టులో స్టేకి వెళ్లారు

**- భువనగిరి ఎంపీ చామల కిరణ్**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కేటీఆర్.. జన్వాడ ఫాం హౌస్ నాది కాదంటారు..? మిత్రున్ని కోర్టుకు పంపించారు.. అక్రమ నిర్మాణం కూల్చాలి అంటారు.. ఇంకో పక్క కోర్టులో స్టేకి వెళ్ళారని ఎంపీ చామల కిరణ్ అన్నారు. బుధవారం గాంధీ భావం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ... కేటీఆర్ పక్కన ఉండే చిల్లర మనుషులు మార్ఫింగ్ ఫోటోలతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని.. ఎఫ్టీఎల్ పరిధిలో ఎవరికి ఉన్నా.. హైడ్రా తన పని తాను చేస్తుందన్నారు. రంగనాథ్ కి అక్రమ నిర్మాణం ఉంటే లేఖ ఇవ్వాలని.. తాము చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా ఎవరు నిర్మాణం చేసినా.. చర్యలు తీసుకుంటారని.. చట్టానికి ఎవరూ అతీతులు కాదని స్పష్టం చేశారు.

సోషల్ మీడియాలో మాపై కామెంట్ చేస్తున్నారని.. మేము రిప్లై ఇవ్వకుండా బ్లాక్ చేసుకుంటున్నారని ఎంపీ తెలిపారు. కేటీఆర్.. ఆయన కేటు గాళ్ళు మా అకౌంట్స్ బ్లాక్ చేస్తున్నారన్నారు. ఎంపీ ట్వీట్ కి కౌంటర్ కి ఒక రేటు.. సీఎం ట్వీట్ పై కౌంటర్ కి ఒక రేటు తో పోస్టు పెట్టే చిల్లర కేటుగాళ్లు ఉన్నారన్నారు. మీలాగా మావి చీకటి బతుకులు కావని చెప్పారు. ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందని తెలిపారు. రేషన్ కార్డులు పొరపాట్లు ఉంటే కొంత ఇబ్బంది జరుగుతుందని పేర్కొన్నారు. తప్పిదాలు ఉంటే నోడల్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం 31 వేల కోట్లు రుణమాఫీ డబ్బులు విడుదల చేసిందని గుర్తు చేశారు. లబ్ధిదారులకు పంపే పనిలో సర్కార్ ఉందన్నారు.

## రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యుడిగా మనోహర్ గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్:** వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం పిన్నంచర్ల గ్రామంలోని సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చి విద్యార్థి దశలో ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా అనేక సామాజిక, విద్యార్థి ఉద్యమాలలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొని, ఎల్లప్పుడూ ప్రజాశ్రేయస్సును కోరుకునే భారతీయ జనతా పార్టీ కోసం పనిచేసిన నన్ను పార్టీనాయకత్వం గుర్తించి నేడు రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులుగా నియమించడం అనందనదాయకమని మనోహర్ గౌడ్ అన్నారు. నాపై విశ్వాసంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్రనాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాని మనోహర్ గౌడ్ అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అమలుకు ఆర్డినెన్స్ తేవాలి

**విశ్వంభర, బషీర్ బాగ్:** రాష్ట్రంలో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలుకు సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ఆర్డినెన్స్ తేవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ లోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్లు అందజేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నో ఏండ్లుగా అన్నిరంగాల్లో వెనుకబడిన మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధికి మాల సోదరులంతా కలిసి రావాలని కోరారు. బేడ, బుడగ జంగాల జేఏసీ చైర్మన్ హన్మంత్ మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా కొంతమంది కుట్రతో భారత్ బంద్ చేపట్టారన్నారు. ఎస్సీలంతా కలిసి వుంటేనే మరింత రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వాలను కోరవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉపకులాల నేతలు మంచాల యాదగిరి, జీడీ నర్సింహ్మా, రుక్కమ్మ, జ్యోతి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



## వైద్యుల నిర్లక్ష్యంతో 5 ఏళ్ల చిన్నారి మృతి

- అడ్మిషన్ తీసుకోలేదని అరగంట ఆలస్యం చేసిన వైద్యులు
- రూ. 35 వేలు కట్టించుకుని వైద్యం ప్రారంభించని వైద్యులు
- అప్పటికే మృతి చెందిన చిన్నారి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** అత్యవసర స్థితిలో హాస్పిటల్ కు తీసుకువచ్చిన చిన్నారి అదిర (5)కు చికిత్స అందించకుండా అడ్మిషన్ తీసుకోవాలని అడ్మిషన్ పేరుతో అరగంట ఆలస్యం చేయడం వల్ల తమ చిన్నారి మృతి చెందిందని కొత్తపేట పారమిత హాస్పిటల్ ముందు బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే నల్గొండ పానగల్ కు చెందిన 5 సంవత్సరాల చిన్నారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని నల్గొండ టౌన్ లో ఓ హాస్పిటల్ కు తీసుకువెళ్లగా కండిషన్ మంచిగా లేదని హైదరాబాద్‌కు తీసుకువెళ్ళమనీ సూచించారు. రాత్రి 12గంటలకు పారమిత హాస్పిటల్ తీసుకురాగా సుమారు 45 నిమిషాల వరకు ట్రీట్మెంట్ చేయకుండా అడ్మిషన్ అమౌంట్ కట్టించు కోవడానికి ఆలస్యం చేయడం వల్లనే తమ చిన్నారి మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. వైద్యులు, హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తమ చిన్నారి మృతి చెందినదని హాస్పిటల్ పై చర్యలు తీసుకోవాలని బంధువులతో కలసి ఆందోళనకు దిగారు. పైగా హాస్పిటల్ వర్గాలు మీరు అడ్మిషన్ తీసుకోవడం ఆలస్యం కావడంతోనే ఇలా జరిగిందని చెప్పడంతో బందువులు ఆందోళన చేపట్టారు. రాత్రి నుంచి పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఇదే విషయంపై చిన్నారి తల్లిదండ్రులు డిప్యూటీ డీ.ఎం.హెచ్.ఓ గీతకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డీ.యం.హెచ్.ఓ గీత, వైద్య అధికారి వెంకటరమణ, సరూర్ నగర్ పీ.హెచ్.సీ వైద్యులు అర్చనలు పారమిత హాస్పిటల్ పై విచారణ చేపట్టారు.

### మహిళలకు పని ప్రదేశంలో

## భద్రత కల్పించాలి




**- బ్యాంకు మహిళా ఉద్యోగుల డిమాండ్**

విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్, లిబర్టీ, ఇండియన్ బ్యాంకు జోనల్ కార్యాలయం వద్ద ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కోలకతా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యను నిరసిస్తూ వివిధ బ్యాంకుల మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. అత్యాచారం, హత్య గురైన జూనియర్ డాక్టర్ కు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించి, నిందితుడికి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాంబాబు తోపాటు అనేకమంది పురుష ఉద్యోగులు కూడా సంఘీభావంగా పాల్గొన్నారు. మహిళలపై హింసాత్మక దాడులు నిరోధించాలని, దోషులను మరింత కఠినంగా శిక్షించాలని వారు నినదించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కోలకతాలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానుష హత్యాచారం ఘటనను తీవ్రంగా ఖండించారు. నిజం రాబట్టడానికి వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ను కస్టోడియల్ విచారణ చేపట్టాలని, సీబీఐ ఆధ్వర్యంలో జరిగే విచారణ నిక్కచ్చిగా, వేగంగా దర్యాప్తు పూర్తి చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిషత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడే వారికీ శిక్షలు ఒక హెచ్చరికగా ఉండాలని అయన కోరారు. గత పదిరోజులుగా దేశవ్యాప్తంగా ఆసుపత్రులలో పని చేస్తున్న వైద్యులకు పూర్తి భద్రత కల్పించాలని కోరుతూ చేస్తున్న ఆందోళనకు బ్యాంకు ఉద్యోగుల పూర్తి మద్దతు ఉంటుందని బీ.ఎస్. రాంబాబు తెలియజేసారు. ఈ ప్రదర్శనకు ఆంధ్ర ప్రదేశ్ అండ్ తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య సంయుక్త కార్యదర్శి పీ.వీ. కృష్ణ రావు, మహిళా అడ్వైజరి కౌన్సిల్ సభ్యులు మీనాక్షి, జి. పద్మ, రేఖ, మంజుల, సుప్రియ సార, సావిత్రి, సమాఖ్య ఉపాధ్యక్షురాలు జి. పద్మ పాల్గొన్నారు.

## జన్వాడ భూములన్నీ కేటీఆర్‌వే

- ఎవరినైనా సరే వదిలే ప్రసక్తే లేదు
- ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తన పేరుమీద ఎలాంటి ఫాంహౌస్ లేదని, తన మిత్రుడికి ఉన్న ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నానని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. బుధవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..జన్వాడ భూములన్నీ కేటీఆర్‌వేనని, ఇందులో ఎలాంటి అనుమానమూ అవసరం లేదని తెలిపారు.కేటీఆర్‌కు పౌరుషం ఉంటే ఫాంహౌస్‌ని కూలగొట్టాలని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎఫ్టీఎల్‌లో ఉన్న ఎవరినైనా వదిలే ప్రసక్తే లేదని, సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేసి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. హైడ్రాకు మంచి పేరు వస్తుందని విగ్రహాల పేరుతో కేటీఆర్ డ్రామాలు ఆడుతున్నారని చెప్పారు.

కేటీఆర్, హరీశ్ రావు దమ్ముగిసిందని, బీఆర్ఎస్ పార్టీ కూలిపోయే పరిస్థితిలో బీజేపీని పట్టుకొని వేలాడుతోందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దురాక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులని హైడ్రా కాపాడుతుందని స్పష్టం చేశారు. లక్ష చదరపు అడుగుల్లో ఫాంహౌస్ ఉందని, ఎవరైనా భూములను లీజుకు తీసుకుంటారని అన్నారు. కానీ, కేటీఆర్ మిత్రుడి ఫాంహౌస్‌ని లీజుకు తీసుకున్నానంటూ కొత్త డ్రామాకు తెర లేపారని చెప్పారు. అది కేటీఆర్ ఫాంహౌస్ అని పోలీసులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. అక్రమ కట్టడమని రేవంత్ రెడ్డి ఎన్జీటీకి వెళ్తే అరెస్ట్ చేశారని, జన్వాడ ఫాంహౌస్ భూములన్నీ కేటీఆర్ సతీమణి శైలిమ పేరు మీద ఉన్నాయని చెప్పారు.

## కమేలాను సందర్శించిన మేయర్



**విశ్వంభర, మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని చెంగిచెర్లలో ఉన్న కమేల నుండి వస్తున్న దుర్వాసన వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదు రావడంతో బుధవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కమీషనర్ జీ.రామలింగం, కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, కిరణ్ కుమార్ రెడ్డి లతో కలిసి మేయర్ పర్యటించారు. కమేలాలో పర్యటించి దుర్వాసన రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కమేలా నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత లాంటి విషయాలపై నివేదిక ఇవ్వాలని నిర్వహకులను ఆదేశించారు. కమేల చుట్టూ నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కమీల నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బీఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, కొత్త కిషోర్ గౌడ్, కుర్రి శివశంకర్, కొత్త విక్రమ్ గౌడ్, కమేలా నిర్వాహకుడు యూసుఫ్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అనిల్



**విశ్వంభర, సరూర్ నగర్ :** రంగారెడ్డి జిల్లా అర్బన్ యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా సిల్వేరి అనిల్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పలు కమిటీలను ఏర్పాటు చేసింది. అందరూ భాగంగానే అనిల్ కుమార్ కు ఆ పదవి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజ య్ , ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తారని అన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

### ఎమ్మెల్యేకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వినతి

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. రాధిక, అధ్యాపకులు బుధవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలసి కళాశాల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. నూతన కళాశాల భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. కళాశాలకు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాల గురించి కూడా ఆమె ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. తక్షణమే స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి నూతన కళాశాల భవనమును తొందరగా అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు డాక్టర్ సురేష్, డాక్టర్ డివి రావు, డాక్టర్ రాకేష్ భవాని, డీ ఎస్ ఎస్ ఆర్ కృష్ణ, హృదయ రాజు, డాక్టర్ శంకర్, డాక్టర్ ధనరాజ్, డాక్టర్ పవన్ కుమార్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.





కొబ్బరి.. అనగానే కోనసీమే గుర్తుకొస్తుంది. భారీ ఎత్తున పెరిగే కొబ్బరి చెట్ల వల్లే ఆ ప్రాంతానికి సరికొత్త అందం వచ్చింది. పుష్కలమైన ఆదాయమూ సమకూరుతున్నది. ఆ కోనసీమ అందాలు తెలంగాణలో కనిపిస్తే..? కనులకు ఇంపుగా అనిపించే ఆ కొబ్బరి తోటలు.. ఇక్కడి రైతులనూ లాభాల బాట పట్టిస్తే..? అవును.. కేరళ, కోనసీమలకే పరిమితమైన కొబ్బరి తోటల అందాలు, త్వరలోనే తెలంగాణలోనూ కనువిందు చేయనున్నాయి. గతంలో సరైన నీటి వసతి లేక కొబ్బరిసాగుపై ఆసక్తి చూపని రైతాంగం, ఇప్పుడు పుష్కలంగా నీటి సౌకర్యం పెరగడంతో ఆ దిశగా ముందడుగు వేస్తున్నది.

# కొడుకంత చెట్టు!

### ప్రతిభాగం ఉపయోగమే..

కొబ్బరి చెట్టు కాయలే కాకుండా, చెట్టులోని ప్రతి భాగమూ ఉపయోగకరమే. ఏదీ వృథా కాదు. కొబ్బరి పీచు నుంచి తాళ్లు నేయడంతోపాటు, ఈ పీచును చైనాకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ఇక ఆకుల పుల్లల నుంచి చీపుర్లను తయారు చేయవచ్చు. కొబ్బరి పెంకులను కాల్చి ఆ పొడిని రంగుల తయారీలో ఉపయోగిస్తారు. చెట్టుకు గల ఇతర ఉపయోగాలతో, ఉప ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. చెట్టు కొట్టిన తర్వాత వాటి కాండాలను ఇండ్ల నిర్మాణానికి ఉపయోగిస్తారు. ఇలా.. చెట్టు ప్రతి భాగంతో రైతుకు ఆదాయం సమకూరుతుంది.

కొబ్బరి చెట్టు కల్పవృక్ష సమానమైంది. మానవ జీవనంలో ఈ చెట్టుకు ప్రత్యేక స్థానం ఉంది. కొబ్బరి ఈనె నుంచి కొబ్బరి నూనె వరకు.. కొబ్బరి కాయ నుంచి కొబ్బరి బెరడు వరకు.. ప్రతి ఒక్కటీ మనిషికి ఉపయోగపడేదే. అందుకోసమే కొబ్బరి చెట్లను పెంచుకునేందుకు చాలా మంది ఇష్టపడుతుంటారు. మన తెలంగాణలో ఎక్కువగా వ్యవసాయ బావుల వద్ద, పొలం గట్లపైన ఒకటో రెండో చెట్లను మాత్రమే పెంచుకొనేవారు. కానీ, కొబ్బరి తోటలవైపు అడుగు మాత్రం వేయలేకపోయారు. కాళేశ్వరంతో నీటి తిప్పలు తప్పిన తర్వాత.. ఇప్పుడు కొబ్బరి తోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో, ఈ ఏడాది ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వెయ్యి ఎకరాల్లో కొబ్బరి తోటల పెంపకాన్ని చేపడుతున్నది. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో 1141 ఎకరాల్లో సాగు చేస్తుండగా, 68.46 లక్షల కొబ్బరి కాయల ఉత్పత్తి జరుగుతున్నది. ఇతర జిల్లాల్లోనూ ఆసక్తి ఉన్న రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది.

### మనకు ప్రత్యేకం

ప్రస్తుతం మన రాష్ట్రంలో కొన్ని పొడుగు రకాలను, పొట్టి రకాలను రైతులు సాగు చేస్తున్నారు. పొడుగు రకాల్లో ఈస్ట్ కోస్ట్ టాల్, వెస్ట్ కోస్ట్ టాల్, అండమాన్ ఆర్డినరీ, లక్కదీవి ఆర్డినరీ రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. అదే పొట్టి రకాల్లో చౌగట్ ఆరెంజ్ డ్వార్ఫ్, గంగాబోండం (గౌతమీ గంగ), మలయన్ గ్రీన్ డ్వార్ఫ్, మలయన్ ఎల్లో డ్వార్ఫ్, గోదారి గంగా సంకరరకాలు సాగవుతున్నాయి. సంకర రకాలను మినహాయిస్తే మిగతా రకాల్లో దిగుబడి కాస్త తక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న పొడవు, పొట్టి రకాలతోపాటు తెలంగాణ వాతావరణానికి అనుకూలమైన కొత్త వంగడాలను కేరళలోని సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీపీసీఆర్ఐ) అభివృద్ధి చేసింది. ఇందులో ఎక్కువగా పొట్టిరకం జాతులే ఉన్నాయి. కల్పజ్యోతి, కల్పసూర్య, సంకరజాతి రకాలైన కేర సంకర, చంద్ర సంకర, కల్పసమృద్ధి వంటి రకాలు అందుబాటులోకి వచ్చాయి. సాధారణ జాతులతో పోల్చితే ఈ రకం చెట్లు ఎక్కువ కాయల్ని అందించనున్నాయి. కల్పజ్యోతి రకం వంగడాలకు ఒక్కో చెట్టుకు సగటున 144 కాయలు, కల్పసూర్య వంగడాలకు ఒకోచెట్టుకు 123 కాయలు, కేర సంకర చెట్లకు 130 కాయల దాకా దిగుబడి వస్తుంది. దిగుబడి అధికంగా వస్తుండటంతో, రైతులకు అదే స్థాయిలో లాభాలూ పెరిగే అవకాశం ఉంది. వాస్తవానికి కొబ్బరి సాగుకు నీరు అధికంగా అవసరం అవుతుంది. అందుకే కేరళతో పాటు ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ఎక్కువగా కొబ్బరిని సాగు చేస్తుంటారు. నదీ పరీవాహక ప్రాంతాలు ఇందుకు అనుకూలం. ఇన్నేళ్లూ తెలంగాణలో నీటి వనరులు లేకపోవడంతో కొబ్బరి పంట సాగువైపు రైతులు దృష్టి పెట్టలేదు. ఏపీ సరిహద్దులోని ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాల్లో కొంత మంది రైతులే కొబ్బరిని సాగు చేస్తున్నారు. అయితే ఇప్పుడు తెలంగాణలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పుణ్యామా అని చెరువులు, కుంటలు, బావులు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా గతంతో పోల్చితే భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో కొబ్బరి సాగుకు మన రాష్ట్రం కూడా అనుకూలంగా మారింది. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. అన్ని జిల్లాల్లో కొబ్బరి సాగును ప్రోత్సహిస్తున్నది. అంతర పంటలతో అదనం: కొబ్బరి సాగులో రైతుకు కలిసొచ్చే మరో అంశం అంతరపంటల సాగు. కొబ్బరి చెట్ల మధ్య దూరం ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులు అంతరపంటలను సాగు చేసుకోవచ్చు. అంతర పంటలుగా మొదటి మూడేండ్లపాటు కూరగాయలు, పసుపు, అల్లం, అరటి, పూల తోటల్ని సాగు చేసుకోవచ్చు. ఆ తర్వాత, ఏడేండ్ల నుంచి కోకో పంట సాగు చేసుకోవచ్చు. కూరగాయలు, అల్లం, పసుపు, పూల సాగు వల్ల అప్పటి ధరను బట్టి ఆదాయం పొందవచ్చు. అదే విధంగా కోకో పంట సాగుతో ఏటా నికరంగా రూ. 20వేల వరకు ఆదాయం పొందే వీలుంది. ఈ విధంగా అంతరపంటలతో ఏటా కనీసంగా రూ.50వేలకు పైగానే ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. అంటే అన్నీ కలిపి ఏడాదికి నికరంగా రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల ఆదాయం వచ్చే అవకాశం కనిపిస్తున్నది. రైతులకు భారీ సబ్సిడీ : కొబ్బరి సాగు చేసే రైతులకు భారీ స్థాయిలో సబ్సిడీ లభిస్తున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం తరపున కొబ్బరి అభివృద్ధి సంస్థ కూడా సబ్సిడీ వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీలో భాగంగా గుంతలు తీసేందుకు, ఇతర ఖర్చుల కోసం ఎకరానికి మూడేండ్లకు గానూ రూ.37,414 సబ్సిడీ కింద అందిస్తున్నది. దీనికి తోడు నీరు పారించేందుకుగాను డ్రిప్ సిస్టమ్‌కు అదనపు సబ్సిడీ ఉంటుంది. అదే విధంగా కొబ్బరి అభివృద్ధి సంస్థ రైతుకు అయ్యే ఖర్చులో 25శాతం సబ్సిడీ ఇస్తున్నది. దీంతో రైతుకు పెట్టుబడి భారమంతా ఈ సబ్సిడీలతోనే తీరనున్నది. ఒక విధంగా చెప్పాలంటే, రైతు తన సొంత పెట్టుబడి లేకుండానే కొబ్బరి సాగు చేయవచ్చు. ఇక కొబ్బరి అభివృద్ధి సంస్థ హెక్టారు(2.5 ఎకరాలు)కు అయ్యే ఖర్చులో 25శాతం సబ్సిడీని ఇస్తుంది. ఇందులో భాగంగానే పొడుగు రకం మొక్కలు హెక్టారుకు 150 నాటాల్సి ఉంటుంది. ఒక్కో మొక్కకు రూ. 173 ఖర్చవుతుంది. మొత్తం రూ. 26వేలు ఖర్చయితే ఇందులో రూ. 6,500 రాయితీ లభించగా రైతు రూ.19,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇక హైబ్రీడ్ రకాల్లో ఒక హెక్టారుకు 200 మొక్కలు నాటుతారు. ఒక మొక్కకు రూ.135 చొప్పున మొత్తం రూ.27వేలు ఖర్చవుతుంది. ఇందులో 25శాతం సబ్సిడీ రూపంలో.. అంటే రైతుకు రూ. 6750 రాయితీ రాగా, రూ. 20,250 చెల్లించాల్సి ఉంటుంది. ఇక పొట్టి రకాల్లో హెక్టారుకు 200 మొక్కలు నాటాలి. ఒక్కో మొక్కకు రూ. 150 ఖర్చుకాగా, మొత్తం రూ.30వేలు వ్యయం అవుతుంది.

### రూ. 80వేల నుంచి రూ. 90వేల దాకా..

కొబ్బరి సాగు వల్ల రైతులకు పెద్ద మొత్తంలోనే ఆదాయం సమకూరనున్నది. ఏడాదికి ఎకరానికి రూ. 60 వేల నుంచి రూ.80వేల దాకా నికర ఆదాయం లభించనున్నది. ఒక మొక్క కొనుగోలు చేసి నాటేందుకు రూ. 70 దాకా ఖర్చవుతుంది. అంటే, ఎకరానికి 60 మొక్కలు నాటితే.. రైతుకు రూ.4,200 వ్యయం. వీటికితోడు ఎరువులు, ఇతర ఖర్చులు అదనంగా ఉంటాయి. ఏటా అన్నీ పోనూ ఒక్కో చెట్టుకు రూ. వెయ్యి నుంచి రూ.1500 నికర ఆదాయం వస్తుంది.

కొబ్బరి వంగడాల రకాలను బట్టి మూడు నుంచి ఐదేండ్లలో పంట ఉత్పత్తి ప్రారంభమవుతుంది. పొడవు రకం వంగడాల్లో ఐదు నుంచి ఆరేండ్లలో కాయలు కాస్తాయి. అదే పొట్టి రకం, సంకర జాతి వంగడాల్లో మూడు నుంచి నాలుగేండ్లలోనే కాయలు వస్తాయి. పొడుగు వంగడాలతో పోలిస్తే పొట్టి రకం, సంకరజాతి వంగడాల్లో దిగుబడి కూడా అధికంగానే ఉంటుంది. ప్రతి మూడు నెలలకోసారి కాయలను తెంపేందుకు వీలుగానూ ఉంటుంది.

### ఎక్కువ తేమ అవసరం..

కొబ్బరి సాగుకు అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం అధికంగా ఉండే నేలలు అనుకూలంగా ఉంటాయి. అయితే ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల ఇతర ప్రాంతాల్లోనూ వీటిని సులభంగా సాగు చేసుకోవచ్చు. వేసవిలో రోజూ కనీసం 50 నుంచి 60 లీటర్ల నీరు అందించాల్సి ఉంటుంది. సేంద్రియ విధానం ద్వారా నేలలో ఎక్కువ కాలం తేమ ఉండేలా చేయవచ్చు. రాలిపోయే కొబ్బరి ఆకుల్ని, అంతర పంటల ఆకుల్ని కాల్చివేయకుండా అదే స్థలంలో ఉంచాలి. తద్వారా నేలలో తేమశాతం అధికంగా ఉంటుంది. ఈ చెట్లకు నీరు అందించేందుకు డ్రిప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

### ఎకరానికి 60 మొక్కలు..

కొబ్బరి సాగులో మొక్కల ఎంపిక నుంచే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన మొక్కల్ని ఎంపిక చేసుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి చీడపీడల బాధలు లేకుండా నివారించవచ్చు. ఏడాది నుంచి ఏడాదిన్నర వయసు గల మొక్కల్ని మాత్రమే నాటుకోవాలి. ఎక్కువ ఆకులు, మొదలు లావుగా ఉండి, ఆకులు త్వరగా విడివడే లక్షణాలు గల మొక్కల్ని ఎంచుకోవాలి. 20 నుంచి 40 ఏండ్ల వయసు గల చెట్టు నుంచి తీసిన విత్తనాల ద్వారా ఉత్పత్తి చేసే మొక్కకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇక రకాన్ని బట్టి ఎకరానికి 60 నుంచి 70 మొక్కలను నాటుకోవచ్చు. మొక్కకూ మొక్కకూ కనీసం 8 మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. కొబ్బరి సాగు చేయాలనుకునే రైతులకు ఉద్యానశాఖ అధికారులే మొక్కలను సరఫరా చేస్తారు.



### 70 ఏండ్ల పాటు దిగుబడి

ఇతర పంటల మాదిరిగా కాకుండా కొబ్బరి సాగు దీర్ఘకాలిక పంట. మొక్క నాటిన నాటి నుంచి కనీసం 50 నుంచి 70 ఏండ్ల పాటు దిగుబడి వస్తూనే ఉంటుంది. మరో నాలుగైదేండ్లలో దిగుబడి తగ్గుతుందన్న దశలో.. అదే ప్రాంతంలో కొత్త పంట సాగుకు చర్యలు తీసుకోవాలి. పాత చెట్లకు మూడు నాలుగు మీటర్ల దూరంలో కొత్త మొక్కల్ని నాటుకోవాలి. దీంతో పాత మొక్క దిగుబడి ఆగిపోయే నాటికి కొత్త మొక్క దిగుబడి ప్రారంభం అవుతుంది. దీంతో రైతుకు నిరంతర ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది.

### పెట్టుబడిలేని పంట..

అశ్వారావుపేటలో తొలిపంట మాదే. 30 ఏళ్ల కిందట వేశాను. దిగుబడి బాగా వస్తున్నది. పెట్టుబడి ఖర్చు మొత్తం ప్రభుత్వం నుంచి సబ్సిడీల రూపంలో ఇస్తున్నది. పెట్టుబడిలేని పంట ఇది. అన్ని ఖర్చులూ పోనూ ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల దాకా ఆదాయం సమకూరుతున్నది. తెలంగాణలోని ఇతర ప్రాంతాల నేలలు కూడా అనుకూలంగానే ఉన్నాయి. నీటి వసతి పెరిగిన ప్రాంతాల్లో వేసుకోవచ్చు.

## వినూత్నంగా పత్తిసాగు

**కొత్త ఆలోచనలతో ఐదెకరాల భూమిలో పలు రకాల పంటలు పండిస్తున్నాడు ఆ రైతు. ఒక్కసారి సాగు చేసి, రెండో సారి ఎలాంటి పెట్టుబడి లేకుండా వినూత్నంగా పత్తి సాగు చేస్తున్న మారెడ్డి నర్సింహారెడ్డి పై 'ఎవుసం' కథనం.**



సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామానికి చెందిన మారెడ్డి నర్సింహారెడ్డి కొత్త ఆలోచనలతో పత్తి పంట సాగు చేస్తున్నాడు. గత సంవత్సరం ఒక ఎకరం భూమిలో పత్తి పంట సాగు చేశాడు. అయితే గతంలో వేసిన పంటను నరికేయకుండా ఈ సంవత్సరం కూడా అలాగే ఉంచి, సాగు చేస్తున్నాడు. పత్తి తీసిన తరువాత.. ప్రతి రైతూ వర్షాకాలం ప్రారంభంలో కానీ ఎండాకాలంలో కానీ ఎండిన చెట్లను తీసేసి, కాల్చి వేస్తాడు. కానీ నర్సింహారెడ్డి మాత్రం అలా చేయకుండా రోహిణి కార్తె కంటే ముందు.. ప్రతి పత్తి చెట్టును ఒకటిన్నర అడుగు పైన కత్తిరించి అలాగే ఉంచాడు. దీంతో ఇగురు వేసిన పత్తి చెట్లకు ఎరువులు వేయడంతో పాటు.. కలుపు, పిచికారీ లాంటి తగు జాగ్రత్తలు తీసుకొన్నాడు. ఇప్పుడు మామూలు పత్తిలానే పెరిగి పూత దశనుంచి కాత దశకు చేరింది. పంటలో ఎలాంటి మార్పు లేకుండా చెట్టు ఎదిగింది.

### సమయం, పెట్టుబడి ఆదా

ఇలా పత్తి సాగు చేయడం వల్ల పెట్టుబడితో పాటు చాలా సమయమూ ఆదా అవుతుంది. దున్నకాల ఖర్చు, విత్తనాలు, ఎరువులు.. ఇలా చాలా రకాలుగా కలిసివస్తుంది. దీనిని జీరో బేస్డ్ వ్యవసాయంగా చెప్పవచ్చు. పెట్టుబడి లేకుండా సేద్యం చేయడాన్నే.. జీరో బేస్డ్ వ్యవసాయంగా నిర్వచిస్తారు. వ్యర్థాలను ఉపయోగించుకొని పంటలో మార్పు లేకుండా వీలైనంత మేరకు దిగుబడి సాధించడం అన్నది పలువురికి ఆదర్శమని చెప్పాలి. నీళ్ల వసతి ఎక్కువగా లేని వాళ్లకు ఇది మరింత ప్రయోజనకరం. ప్రభుత్వం నియంత్రిత సాగు విధానం ద్వారా పత్తి పంటను సాగు చేసుకోవాలని చెప్పడంతో.. ఇలా వినూత్నంగా సాగు చేస్తే రైతులకు ఎంతో లాభదాయకమని అధికారులు చెబుతున్నారు. నా సొంత ఆలోచనతోనే.. గతంలో మల్బరీ, పొద్దు తిరుగుడు లాంటి పంటలు సాగు చేసిన. మల్బరీ సాగు పద్ధతినే పత్తిలో అనుసరిద్దామని ఇలా చేసిన. తక్కువ రోజుల్లో పంట చేతికస్తది. మొన్నటిసారి పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈసారి ఇలా చేయడం వల్ల పంట దిగుబడి బాగానే వస్తుందని ఆశిస్తున్న.

# కొండా.. కోనల్లో.. లోయల్లో..







**అరకును తలపించే ప్రకృతి సౌందర్యం పశ్చిమ ఏజెన్సీ సొంతం**

**ఎన్నెన్నో ప్రాంతాలు.. అన్నింటా అందాలు**

**పర్యాటక అభివృద్ధికి నిరీక్షణ**

'అందని మిన్నే ఆనందం..
అందే మన్నే ఆనందం...
అరె భూమిని చీల్చుకు పుట్టే పసిరిక ఆనందం..

**మంచుకు ఎండే ఆనందం.. వాటికి వానే ఆనందం.. అరె ఎండకి వానకి రంగులు మార్చే ప్రకృతి ఆనందం..' అని ఓ సినీకవి ప్రకృతి విశిష్టతను ఎంతో గొప్పగా వర్ణించారు. అలాంటి అందమైన అరకు ప్రాంతానికి ఏమాత్రం తక్కువ కాకుండా పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం ప్రకృతి సొబగులతో కనువిందు చేస్తోంది.**

కొండా.. కోనా.. వాగు.. వంక.. ప్రకృతి రమణీయతతో కట్టిపడేస్తున్నాయి. తొలకరి జల్లుల తర్వాత కురిసే వర్షాలతో పచ్చని చీరను కప్పుకున్న అటవీ అందాలు మైమరపింపజేస్తున్నాయి. కొండవాగుల్లో జలపాతాలను తలపించే నీటి ప్రవాహాలు అబ్బురపరుస్తున్నాయి. బుట్టాయగూడెం మండలంలోని గోగుమిల్లి నుంచి గుబ్బల మంగమ్మ ఆలయం వరకు అటవీ ప్రాంతంలో ఎన్నెన్నో అందాలు. ప్రధానంగా పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకూ దట్టమైన అటవీ ప్రాంతంలో తారురోడ్డుపై ప్రయాణం వెన్నెల్లో హాయ్ హాయ్ అన్నట్టు సాగుతుంది. రోడ్డుకు రెండువైపులా పొడవైన చెట్లు, ఎత్తైన కొండల మధ్య ప్రయాణం ఆహ్లాదంగా ఉంటుంది. రెండు కొండల మధ్య నిర్మించిన జల్లేరు జలాశయం నిండు కుండలా కళకళలాడుతున్నప్పుడు చుట్టూ కొండలతో మరింత సుందరంగా కనిపిస్తుంది. దట్టమైన అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండల నడుమ కోడెవాగు కళ్లు తిప్పుకోకుండా చేస్తుంది. జూలై తర్వాత కురిసే వర్షాలతో మోడు బారిన చెట్లు సైతం చిగురించి అడవి తల్లి సరికొత్త అందాలను సంతరించుకుంటోంది. ఇలా పశ్చిమ ఏజెన్సీలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. గతంతో పోలిస్తే ప్రయాణ సౌకర్యాలు బాగున్నాయి. ఈ ప్రాంతంలో పర్యాటకంపై అధికారులు దృష్టి సారిస్తే పశ్చిమ ఏజెన్సీలో అభివృద్ధి సవ్వడులు మార్మోగుతాయి.

### ఉల్లి షాంపూతో జుట్టు రాలడం ఆగుతుందా?

నా వయసు 31 సంవత్సరాలు. కొన్ని నెలలుగా జుట్టు బాగా రాలిపోతున్నది. ఇంట్లో అనేక రకాల చిట్కాలు పాటించి చూశాను. అయినా ఆగట్లేదు. బీర్ సంబంధిత షాంపూలు, ఉల్లిగడ్డ ఎసెన్స్‌తో చేసిన షాంపూలు వాడితే జుట్టు రాలడం ఆగుతుందనీ, ఒత్తుగా పెరుగుతుందనీ అంటున్నారు. వీటితో ఉపయోగం ఉంటుందా? జుట్టు రాలిపోకుండా ఉండాలంటే నేనేం చేయాలి? వనపర్తి జుట్టు రాలుతున్నదంటే ముందుగా చాలామంది ఇంటి చిట్కాలు పాటిస్తారు. ఉల్లిపాయ రసం, పెరుగు లాంటివి తలకు పెట్టుకుంటే జుట్టు రాలడం ఆగుతుందని నమ్మకాలుంటాయి. వీటిలో నిజం లేదు. షాంపూల వల్ల జుట్టు రాలకుండా ఉంటుందనుకోవడం కూడా నిజం కాదు. చుండ్రు లాంటి సమస్యలున్నప్పుడు యాంటి డాండ్రఫ్ షాంపూ, డ్రై హెయిర్ ఉన్నప్పుడు మాయిశ్చరైజ్ చేసే షాంపూలు వాడితే ఫలితం ఉంటుంది. అంతేకానీ జుట్టు రాలడాన్ని ఆపే యాంటి హెయిర్ ఫాల్ షాంపూల వల్ల మాత్రం ఫలితం ఉండదు. జుట్టు రాలడానికి కారణమయ్యే మూల సమస్యకు చికిత్స చేస్తే తప్ప హెయిర్ ఫాల్ ఆగదు. జుట్టు రాలడానికి అనేక కారణాలుంటాయి. పోషకాహార లోపం, థైరాయిడ్ లాంటి సమస్యలు ఇందుకు ప్రధాన కారణం. ఏజింగ్ వల్ల, ప్రెగ్నెన్సీ తర్వాత డెలివరీ సమయంలోనూ జుట్టు రాలుతుంది.





# పంచాయతీ ఎన్నికల కసరత్తు షురూ

(మొదటి పేజీ తరువాయి)

సంఘం కార్యాచరణ మొదలు పెట్టింది. ఈ ఏడాది జనవరి 31వ తేదీ నాటికే పంచాయతీల పదవీ కాలం ముగిసింది. గత ఏడాది డిసెంబరులోనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కేవలం రెండు నెలల తేడాతోనే ఎన్నికల నిర్వహణకు పోలేకపోయింది. ముఖ్యంగా మార్చిలోనే లోక్ సభ ఎన్నికల హడావిడి మొదలు కావడంతో పంచాయతీ ఎన్నికల విషయాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టి, గ్రామాల పాలనను ప్రత్యేక అధికారుల చేతుల్లో పెట్టింది. 2019లో తెలంగాణలోని 12, 769 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో జనవరి 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మరో 224 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఇవన్నీ కలిపి ఇపుడు 12,993 గ్రామ పంచాయతీలు అయ్యాయి. వీటి ఎన్నికల కోసం కులగణన అంశం కీలకంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కుల గణను ముఖ్యంగా బీసీకుల గణను చేపడతామని హామీ ఇచ్చింది. రెండు రోజుల కిందటే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం కుల గణన చేపట్టాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే అంశంపై సందిగ్ధం నెలకొంది. కానీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాత్రం తమ పని తాము చేసుకుపోతోంది.

**ఓటరు లిస్టుల కార్యాచరణ ఇలా..**

అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు లిస్టుల ఆధారంగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీ, గ్రామ పంచాయతీల వారీగా ఓటరు లిస్టుల తయారు చేయించడం, వాటిని ప్రచురించం కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యుల్ ప్రకారం సెప్టెంబరు 6వ తేదీన వార్డు వారీ, గ్రామ పంచాయతీల వారీగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టులు ఆయా జిల్లాల్లోని మండల అభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు తయారు చేసి గ్రామ పంచాయతీలలో ప్రకటించాలని నిర్ణయించారు. ఆ డ్రాఫ్ట్ ఓటరు లిస్టులపై జిల్లా కలెక్టర్లు, మండల అభివృద్ధి అధికారులు వచ్చే నెల 9, 10వ తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి, మండల స్థాయి సమావేశాలు జరిపి వారి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. ఈ డ్రాఫ్ట్ ఓటరు లిస్టులపై సంబంధిత జిల్లా పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటిని వచ్చే నెల 19వ తేదీలోగా పరిష్కరించి 21వ తేదీ నాడు వార్డుల వారీ, గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ, మండల పరిషత్ లలో ప్రచురించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డ్ సభ్యుల పదవులకు జరగవలసిన 2వ సాధారణ ఎన్నికలలో భాగంగా వార్డు వారీ, గ్రామపంచాయతీల వారీగా ఓటరు లిస్టుల తయారీ షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సంబంధిత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నత అధికారులు, ఎలక్షన్ కమిషన్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు.

## ఫుడ్ సేఫ్టీ పై తనిఖీలు నిర్వహించాలి

- పాఠశాలలు, హాస్టళ్లలో ఫాగింగ్ చేయాలి
- అడిషనల్ జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

**విశ్వంభర హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కలుషిత ఆహార విక్రయాలు జరగకుండా ఉండేందుకు ఫుడ్ సేఫ్టీ వింగ్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీకమిషనర్ అమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం అడిషనల్, జోనల్ కమిషనర్ లతో కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాల పై తనిఖీలు నిర్వహించడంతో పాటు దోమల నివారణ, నియంత్రణ కార్యక్రమాల పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అన్ని హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, క్యాంటీన్లు, ఆహార పదార్థాలు తయారీ చేస్తున్న కేంద్రాలను తనిఖీ చేయాలని, నాణ్యతా ప్రమాణాలతో కూడిన హైజనిక్ ఫుడ్ తయారు చేస్తున్నదీ, లేనిది పరిశీలించాలన్నారు. ఆహార పదార్థాల తయారీ గది శుభ్రంగా ఉండాలని, నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్నాయా? లేదా అన్నది చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విద్యార్థులు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే ఫుడ్ సెంటర్లు, హాస్టల్ యాజమాన్యాల పై చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల నివారణ చర్యల పై నగరంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని, వాటి చుట్టూ ఫాగింగ్ చేయడంతో పాటు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ద్రోహం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## ఎమ్మెల్సీ సత్యవతి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ద్రోహం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీస్లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీలో అనేక లోపాల వల్ల వారికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఏ గ్రామంలో చూసినా రుణమాఫీ కాని రైతులే ఎక్కువ ఉన్నారని, వారు ప్రతి రోజూ బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలను మాత్రం ప్రభుత్వం పరిష్కరించడం లేదని విమర్శించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు మాత్రం రైతు రుణ మాఫీ అవుతుందని, రాష్ట్రంలో ఉన్న నిరుపేద రైతులకు మాత్రం ప్రభుత్వం మాఫీ చేయలేదన్నారు. రైతులకు రేషన్, ఆధార్ కార్డు సరిలేదని, ఒకే కుటుంబం అని అనేక రకాలు తప్పులను చూపి రుణాలను మాఫీ చేయలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను, మేధావులను ఇబ్బంది పెట్టే భాష వాడడం సరి కాదని, వెంటనే తన భాషను మార్చుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో ఒక స్వర్ణయుగంగా కొనసాగిందని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు.



# వైరల్ జ్వరాలతో వణుకుతున్న తెలంగాణ

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** వాతావరణ పరిస్థితుల మార్పుల కారణంగా వైరల్ జ్వరాలతో రాష్ట్రం వణుకుతోంది. మరోవైపు డెంగ్యూ విజృంభిస్తోంది. గన్యా, మలేరియా కేసులూ ఇబ్బడిముబ్బడిగా నమోదవుతున్నాయి. పల్లె.. పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో విస్తరిస్తుండటంతో ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. అన్ని దవాఖానాల్లో ఓపీ సగటున 10-30 శాతం వరకు పెరగగా.. కొన్ని చోట్ల అంతకన్నా అధికంగా ఉంది. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అదే పరిస్థితి ఉంది. గత ఇరవై రోజుల వ్యవధిలో బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, ఇంకోవైపు వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా రాష్ట్రంలో జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత వ్యాధులు విస్తరిస్తున్నాయి. దీనికితోడు వర్షాల కారణంగా పారిశుద్ధ్యం లోపించడంతో దోమల వ్యాప్తి పెరిగింది. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా, గన్యా జ్వరాలు విస్తరిస్తున్నాయి. ప్రధానంగా హైదరాబాద్, సూర్యాపేట, రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో డెంగీ కేసులు ఎక్కువగా



నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారమే ఈ ఏడాది ఇప్పటివరకు 4,395 డెంగీ కేసులు నమోదుకాగా, హైదరాబాద్లోనే అందులో మూడోవంతు నమోదయ్యాయి. జూన్ నుంచి బాధితుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. రాష్ట్రంలో జూన్ వరకు 1,078 మంది డెంగీ బారిన పడగా, జులైలో ఆ సంఖ్య 1,461కి పెరిగింది. ఆగస్టు నెలలో 20 రోజుల్లోనే 1,856కుపైగా నమోదవడం తీవ్రతను సూచిస్తోంది. అనధికారికంగా ఈ కేసుల సంఖ్య అంతకు 10 రెట్లు అధికంగా ఉంటుందని అంచనా. కొన్నిచోట్ల మరణాలు సంభవిస్తున్నా..ఇతర కారణాలతో మృతి చెందినట్లు తేల్చేస్తుండటంతో నమోదు కావడం లేదనే ఆరోపణలున్నాయి.

గ్రామీణం, ఏజెన్సీ ప్రాంతాల పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కొన్ని కుటుంబాల్లో ఇద్దరికంటే ఎక్కువ మంది జ్వరాల బారిన పడి ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో పడకలు సరిపోక ఓపీలోనే వైద్యం చేసి పంపిస్తున్నారు. ఉదాహరణకు కామారెడ్డి జిల్లా ఆసుపత్రిలో సగటున 600-700 మధ్య ఉండే ఓపీ కొన్ని రోజులుగా వెయ్యి దాటుతోంది. హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో రోజువారీ ఓపీ 1100-1700 వరకు ఉండగా, గత వారం రోజులుగా 2,300లకుపైగా నమోదవుతోంది. హైదరాబాద్లోని ఫీవర్ ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రుల్లో ఓపీ సాధారణం కన్నా 20-30 శాతం పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మలేరియా, గన్యా కేసులు నమోదవుతున్నట్లు వైద్య వర్గాలు కూడా ధ్రువీకరిస్తున్నాయి. 'రాష్ట్రవ్యాప్తంగా వైరల్ జ్వరాలతో పాటు డెంగీ కేసులు అనూహ్యంగా పెరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న వారిలో పలువురిలో గన్యా, మలేరియా, జపనీస్ ఎన్సెఫలైటిస్ లక్షణాలు ఉంటున్నాయి. అనుమానిత కేసుల రక్త నమూనాలు సేకరించి నిర్ధారిస్తున్నాం' అని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

**జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు**

గన్యా, డెంగ్యూజ్వరాలు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయి కాబట్టి దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'కాచి వడపోసిన నీరు తాగాలి. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినవద్దు. జ్వరం, దగ్గు, తుమ్ములు, ఆయాసం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి' అని సూచిస్తున్నారు.

# తగిన సాక్ష్యాలు సమర్పిస్తే జకీర్ నాయక్‌ను భారత్‌కు అప్పగిస్తాం

## మలేసియా ప్రధాని

**దిల్లీ:** పరారీలో ఉన్న వివాదాస్పద మత బోధకుడు జకీర్ నాయక్ అప్పగింతపై మలేసియా నుంచి సానుకూల సంకేతాలు వెలువడ్డాయి. తగిన ఆధారాలు సమర్పిస్తే, అతడిని భారత్‌కు అప్పగించే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఆ దేశ ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం పేర్కొన్నారు. భారత్ - మలేసియా ద్వైపాక్షిక సంబంధాల ఉన్నతీకరణకు ఈ ఒక్క అంశం అడ్డుపడదని ఇబ్రహీం స్పష్టంచేశారు. మంగళవారం ప్రధాని మోదీ సహా భారత బృందంతో జరిగిన చర్చల్లో జకీర్ నాయక్ అంశం అసలు ప్రస్తావనకే రాలేదని ఆయన తెలిపారు. కొన్నేళ్ల క్రితం ప్రధాని మోదీ ఇతర వేదికలపై ఈ అంశాన్ని లేవనెత్తిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. "ఒక వ్యక్తి లేదా సమూహం గురించే కాకుండా తీవ్రవాదానికి సంబంధించిన ఎలాంటి అంశాన్నైనా మేం చాలా తీవ్రంగా పరిగణిస్తాం. ఆధారాలు సమర్పిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా ఎలాంటి సలహాలు, సూచనలు చేసినా స్వీకరిస్తాం" అని ఇబ్రహీం అన్నారు. మూడు రోజుల పర్యటన కోసం అన్వర్ ఇబ్రహీం సోమవారం దిల్లీ వచ్చారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులతోపాటు పలు రంగాల్లో సహకార విస్తృతికి ప్రధాని మోదీతో చర్చలు జరిపారు. భారత్ నుంచి మలేసియాకు కార్మికులు, నిపుణులను అక్రమ మార్గాల్లో తీసుకెళ్తున్న ఘటనలు పెరుగుతున్నందున, వాటిని నివారించడానికి క్రమబద్ధంగా నియామకాలు జరపాలని రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

**వ్యూహాత్మక భాగస్వామ్యం**

గతంలో మలేషియా మాజీ ప్రధాని మహతీర్ మొహమ్మద్ హయాంలో కొంత ఒత్తిడికి గురైన భారత్ -మలేషియా సంబంధాలను పునరుద్ధరించడంపై ఈ మోదీ, ఇబ్రహీం దృష్టి



సారించారు. ఇరు పక్షాల మధ్య మొత్తం ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. వీటిలో మలేషియాలో భారతీయ కార్మికుల రిక్రూట్‌మెంట్‌ను ప్రోత్సహించడం, వారి ప్రయోజనాల పరిరక్షణ కూడా ఒక అంశంగా ఉంది. డిజిటలైజేషన్, రక్షణ రంగం, సెక్యూరిటీ, సెమీకండక్టర్స్, కృత్రిమ మేధస్సు వంటి రంగాలలో సహకారాన్ని పెంపొందించడంపై చర్చల్లో ఎక్కువగా దృష్టి సారించారు. ఇద్దరు ప్రధానులు తీవ్రవాదాన్ని ఖండించారు. ఏ దేశమూ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించకూడదని, ఉగ్రవాదానికి పాల్పడిన వారిని త్వరితగతిన న్యాయస్థానం ముందుకు తీసుకురావడానికి కలిసి పనిచేయాలని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మలేషియా నుంచి భారత్‌కు గత ఏడాది 5 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని ప్రధాని మోదీ తెలిపారు. ఇరుపక్షాలు తమ జాతీయ కరెన్సీలలో వాణిజ్యాన్ని ప్రారంభించాయని చెప్పారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు మరింత విస్తరించాలని పేర్కొన్నారు.

# కవిత బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు

- కేసీఆర్ ఆదేశంతోనే అభిషేక్ సింఘ్వీకి రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటన
- 38మంది ఎమ్మెల్యేలున్నా నామినేషన్ వేయని బీఆర్ఎస్ పార్టీ
- బీఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం కాబోతుందనేది స్పష్టమైంది
- కాంగ్రెస్‌పై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు



**బీఆర్ఎస్ త్వరలో కాంగ్రెస్‌లో విలీనం కాబోతుంది. తెలంగాణ నుంచి రాజ్యసభకు నామినేషన్ వేసిన అభిషేక్ మను సింఘ్వీ, కవిత బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కవిత కేసును వాదించినందుకే కేసీఆర్ ఆదేశంతో, అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించింది.**
**- బండి సంజయ్, కేంద్రమంత్రి**

**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ గులాబీ, హస్తం పార్టీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం కాబోతుందనేది స్పష్టమైందని బండి సంజయ్ దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి రాజ్యసభకు నామినేషన్ వేసిన అభిషేక్ మను సింఘ్వీ, కవిత బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కవిత కేసును వాదించినందుకే కేసీఆర్ ఆదేశంతో, అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిందని తెలిపారు.

**38మంది ఎమ్మెల్యేలున్నా నామినేషన్ వేయని బీఆర్ఎస్ పార్టీ**

బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నా ఎందుకు రాజ్యస భకు నామినేషన్ వేయలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. బుధవారం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యశాలకు బండి సంజయ్ హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ నామినేషన్ వేయకుండా పరోక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిందని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందా లేక బీజేపీలో విలీనం అవుతుందా ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు.

**బీజేపీని బద్నాం చేయడానికే...**

దిల్లీలో రెండు పార్టీల మధ్య ఒప్పందం జరిగిందని, బీజేపీని బద్నాం చేయడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కుట్రలు పన్నుతున్నాయని బండి సంజయ్ దుయ్యబట్టారు. విగ్రహాల దందా రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు ఆయన హితవు పలికారు. ఆరు గ్యారంటీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నాటకం ఆడుతున్నాయని బండి దుయ్యబట్టారు. సచివాలయం ఎదుట వాజ్‌పాయ్, రాజీవ్ గాంధీ, కేసీఆర్ విగ్రహం పెట్టాలా? అనే దానిపై చర్చ పెట్టాలన్నారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల కోసం డబ్బులు పంపేందుకే, హైడ్రా పేరుతో హైడ్రామా ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ధన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదు లీజుకు తీసుకున్నానంటున్న కేటీఆర్, డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపైన ఎందుకు కేసు పెట్టారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి మంచి వ్యక్తులు వస్తే కచ్చితంగా బీజేపీలో చేర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# సిద్దిపేటలో దారుణం

**విశ్వంభర, సిద్దిపేట:** సిద్దిపేట పట్టణంలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ముక్కుపచ్చలారని మూడేళ్ల చిన్నారిపై యూపీకి చెందిన ఓ కామాంధుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ లో నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి వాచ్‌మెన్‌గా పనిచేస్తూ తన కుటుంబంతో అక్కడే నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూడేళ్ల చిన్నారి తన నాయనమ్మ, తాతల వద్ద ఆడుకుంటూ బిల్డింగ్‌లో ఉంటోంది. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పెయింటింగ్ వర్క్స్ కోసం యూపీకి చెందిన అజయ్ కూడా వచ్చి భవనంలోనే నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో నిందితుడు చిన్నారిని ఆడిస్తానని తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు యూపీకి పారిపోతుండగా పోలీసులు 24 గంటల్లోనే సిద్దిపేట పట్టణంలో గాలించి పట్టుకున్నారు. నిందితుడిపై అత్యాచారం, పోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, రిమాండ్ తరలించినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చిన్నారిని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కఠిన శిక్షలు విధిస్తున్నా : దేశవ్యాప్తంగా వైద్యురాలి హత్యాచార ఘటనపై నిరసనలు జరుగతున్నా కొన్ని మానవ మృగాలు తమ తీరును మార్చుకోవడం లేదు. నెలల పసిపాప నుంచి వృద్ధురాల వరకు భద్రత లేకపోతే కామాంధులు విరుచుకుపడుతున్నారు. రోజుకు ఎక్కడో ఒక చోట ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి కేసుల్లో నిందితులకు సత్వర శిక్ష పడేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు.

# రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు

**ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో డబ్బులు జమ**

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేశామని చెప్పారు. బుధవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆశించామని చెప్పారు. రుణమాఫీ పొందలేని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలు, మండల ఆఫీసుల్లో అధికారులను పెట్టి వివరాలు తీసుకుంటామని తెలిపారు. ''రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని, పదేళ్ల పాటు రైతుల్ని మోసం చేసిన పార్టీ మొసలి కన్నీరు కారుస్తోంది. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ కూడా మాట్లాడుతోంది. అసత్యాలు చెప్పి రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారు. రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదుమంత్రి తుమ్మల స్పష్టం చేశారు . బ్యాంకులు, అధికారులు ఏమైనా తప్పు చేస్తే.. వాటిని సరిదిద్దే ప్రక్రియ కొనసాగుతోంది. 41,78,892 మంది రైతులు రుణాలు తీసుకున్నారని బ్యాంకులు చెప్పాయి. వారి బకాయిలు రూ.31వేల కోట్లు ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా రూ.2 లక్షలలోపు రుణాలే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ పనులు చూసుకోవాలి'' అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# గుండెపోటుతో ఏ ఎస్.ఐ మృతి



**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్‌లో ఏఎస్ఐ గుండెపోటుతో మృతిచెందారు. ఒకటో పట్టణ ఠాణాలో ఏఎస్‌గా పనిచేస్తున్న దత్తాద్రి (56) బుధవారం ఉదయం ఇంట్లో వ్యాయామం చేస్తుండగా కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దత్తాద్రి గత రెండేళ్లుగా నిజామాబాద్ ఒకటో పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. ఆర్మూర్‌కు చెందిన దత్తాద్రి గత 20 ఏళ్లుగా నిజామాబాద్‌లోని గాయత్రి నగర్‌లో నివాసముంటున్నారని స్థానికులు చెప్పారు.

## శ్రీవారి భక్తుల ఆరోగ్య భద్రతే

# ప్రథమ కర్తవ్యం

### టీటీడీ అదనపు ఈవో



**విశ్వంభర, తిరుమల :** తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతోపాటు వారి ఆరోగ్య భద్రతే టీటీడీ కర్తవ్యమని టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులకు, యజమానులకు బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారమే తినుబండారాలు తయారు చేయాలని అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే వేలాది మంది భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని హోటళ్లలో ప్రమాణాలు పాటించాలన్నారు. హోటళ్లలో పరిశుభ్రత, ఆహార పదార్థాలు నిల్వ చేయడం, వడ్డించడం వంటి విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.న్యూ ఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ సిహెచ్ ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్‌ను వివరించారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి తిరుమలలో హోటళ్ల వ్యాపారులందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

## శ్రీశైలం జలాశయం వద్ద విరిగిపడ్డ కొండచరియలు



**విశ్వంభర, అమరావతి :** నంద్యాల జిల్లా శ్రీశైలం జలాశయం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. మండలంలో కురిసిన కుంభవృష్టి వర్షానికి రాత్రి కొండ చరియలు విరిగి పెద్ద బండరాళ్లు ఘాట్‌రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రాత్రి కారణంగా రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం గమనించిన ప్రయాణికులు జిల్లా అధికారులకు సమాచారం అందజేయడంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.రాత్రి నుంచి పరిసర ప్రాంతాల్లో ఎడతెరుపు లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. శ్రీశైలం జలాశయం దిగువన రహదారి మార్గంలో రోడ్డుకు అడ్డంగా కొండ చరియలు విరిగిపడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలోనూ పలుమార్లు కొండచరియలు విరిగిపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరుగకముందే అధికారులు కొండచరియలు విరిగిపడక ముందే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ప్రమాణం



**అమరావతి:** వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన చాంబర్‌లో బొత్సచేత ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ, శాసన మండలిలో ప్రజల కోసం నిలబడతామని , ప్రజా సమస్యలను మండలి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.పార్టీ అధిష్టానం మేరకు బాధ్యతయుతంగా ప్రజల తరుపున మండలిలో చిత్తశుద్ధితో పోరాటం చేస్తానని వెల్లడించారు. రాబోయే కాలంలో విశాఖను,ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని వెల్లడించారు. ప్రస్తుతానికి వైసీపీ పార్టీది మూడు రాజధానుల విధానమేనని అన్నారు. అంతకు ముందు బొత్స వైఎస్ జగన్‌ను కలిసి ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీ పదవి అవకాశం ఇచ్చినందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి అమర్నాథ్, వైసీపీ నాయకులున్నారు. గత మూడు నెలల క్రితం ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా బొత్స సత్యనారాయణతో పాటు మరొక స్వతంత్ర అభ్యర్థి రహీమ్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## భూ రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని రైతు ఆత్మహత్యాయత్నం

**విశ్వంభర , మహబూబ్‌నగర్:** భూ రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఓ రైతు ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్‌కు చెందిన అంజిలమ్మ పేరుపై ఉన్న పట్టా భూమిని ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేసేందుకు చూస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె అల్లుడు నర్సింహారెడ్డి బుధవారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా.. వారు వచ్చి అతడిని పీఎస్‌కు తరలించారు. ఈ విషయమై తాసీల్దార్ తిరుపతయ్యను వివరణ కోరగా.. వెంకట్‌రెడ్డిపల్లికి చెందిన నాగిరెడ్డి, అంజిలమ్మకు ఒక్కతే కూతురు రాఘవేంద్రమ్మ ఉండగా.. నర్సింహారెడ్డిని ఇల్లరికం పెండ్లి చేసుకున్నాడని తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో రాఘవేంద్రమ్మ మృతి చెందగా.. తర్వాత అంజిలమ్మ పేరుపై ఉన్న భూమిని ఇతరుల పేరుపైకి రిజిస్ట్రేషన్ చేసే విషయం తెలుసుకొన్న నర్సింహారెడ్డి అడ్డుపడినట్లు వివరించారు. అత్త పేరుపై ఉన్న భూమికి తానే వారసుడిని.. ఇతరుల పేరుపైకి రిజిస్ట్రేషన్ చేయొద్దని ఆత్మహత్యాయత్నం చేసినట్లు వివరించారు.

# శ్రీశైలం, సాగర్ జలాశయాలను ఇరు రాష్ట్రాలూ కేఆర్ఎంబీకి అప్పగించలేదు

### సుప్రీంకోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌లో జలశక్తిశాఖ వెల్లడి



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల పరిధిలో ఇప్పటివరకు గుర్తించిన 15 ప్రాధాన్య అవుట్‌లెట్లను ఇరురాష్ట్రాలూ కేఆర్ఎంబీకి అప్పగించలేదని కేంద్ర జలశక్తి శాఖ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు అప్పగిస్తే.. అప్పుడు తామూ అప్పగిస్తామని ఏపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపింది. విభజన చట్టంలోని సెక్షన్ 87 ప్రకారం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణ బాధ్యతలను కృష్ణా నదీ యాజమాన్య మండలి(కేఆర్ఎంబీ)కి అప్పగించాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు జారీ చేసిన నోటీసులను అనుసరించి జలశక్తి శాఖ అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ ప్రకారం..''తెలంగాణ ప్రభుత్వం తన పరిధిలో ఉన్న అన్ని అవుట్‌లెట్లను కేఆర్ఎంబీకి అప్పగిస్తే తామూ తమ పరిధిలోని అవుట్‌లెట్లను అప్పగిస్తామని ఏపీ ప్రభుత్వ ఇంజినీర్ ఇన్ చీఫ్ చెప్పారు. అయితే తెలంగాణ విద్యుత్తు కేంద్రాల అవుట్‌లెట్ల అప్పగింత అంశంలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కోల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇరు ప్రభుత్వాల పరిధిలోని అన్ని అవుట్‌లెట్లను కేఆర్ఎంబీకి అప్పగిస్తేనే వాటిని సమర్థంగా నిర్వహించడానికి వీలవుతుంది. రెండు ప్రాజెక్టుల పరిధిలోని అవుట్‌లెట్లను తమకు అప్పగించిన పక్షంలో..ఆయా నిర్మాణాలను కాపాడటానికి భారీ స్థాయిలో నిధులు అవసరమని కేఆర్ఎంబీ ఛైర్మన్ చెప్పారు. మరోవైపు కృష్ణా జలాల పంపిణీ అంశం సహా ఉమ్మడి ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించవద్దని తెలంగాణ అసెంబ్లీ ఈ ఏడాది ఫిబ్రవరి 12న ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో రెండు జలాశయాల పరిధిలో ఇప్పటివరకు గుర్తించిన 15 ప్రాధాన్య అవుట్‌లెట్లను ఇరురాష్ట్రాలూ కేఆర్ఎంబీకి అప్పగించ లేదు. 2021 జులై 15న జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను అనుసరించి ఇరు రాష్ట్రాలూ రూ.200 కోట్ల చొప్పున కేఆర్ఎంబీకి కేటాయించాల్సి ఉన్నా ఇంతవరకూ కేటాయించలేదు'' అని కేంద్ర జలశక్తి శాఖ అఫిడవిట్‌లో పేర్కొంది.

**కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత కేసు విచారణ వాయిదా**

విభజన చట్టంలోని సెక్షన్ 87 ప్రకారం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణ బాధ్యతలను కృష్ణా నదీ యాజమాన్య మండలి(కేఆర్ఎంబీ)కి అప్పగించాలని, ఆలోపు విద్యుత్తు ఉత్పత్తి కోసం ఈ రెండు ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడానికి తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన జీవోపై స్టే ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు సెప్టెంబరు 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా.. ఏపీ ప్రభుత్వం కోరిన మధ్యంతర ఉపశమన(స్టే) విజ్ఞప్తితోపాటు, పిటిషన్ విచారణార్హతను సవాల్ చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ వాదనలపై అదే రోజు విచారణ జరుపుతామని జస్టిస్ అభయ్ ఎస్ ఓక, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. తొలుత ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జైదీప్‌గుప్త వాదనలు వినిపించారు. ''కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించాలని విభజన చట్టంలోని సెక్షన్ 87లో చెప్పారు. ఆ ప్రకారం బోర్డు ఏర్పాటుచేస్తూ నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత రెండు రాష్ట్రాలు తమ పరిధిలోని ప్రాజెక్టులను దానికి అప్పగించాల్సి ఉంటుంది'' అని వాదించారు. విభజన చట్టంలోని 87(1) కింద కేఆర్ఎంబీ పరిధిని నిర్దేశిస్తూ నోటిఫికేషన్ జారీచేసినట్లు అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఐశ్వర్యభాటి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర జల్‌శక్తి మంత్రి నేతృత్వంలోని అపెక్స్ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేలా ఆ నోటిఫికేషన్ జారీచేసిందని, అయితే తెలంగాణ ప్రభుత్వం అందుకు ముందుకురాలేదని తెలిపారు.

# మంకీపాక్స్‌పై అప్రమత్తంగా ఉండాల్సిందే

### కీలక మార్గదర్శకాలు జారీచేసిన ఢిల్లీ ఎయిమ్స్




**ఢిల్లీ:** ప్రపంచ దేశాల్లో ఎంపాక్స్ కేసులు పెరుగుతున్న వేళ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్య అత్యయిక స్థితి ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ఇందులో భాగంగా వ్యాధి లక్షణాలు, అనుమానిత కేసులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఢిల్లీ ఎయిమ్స్ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎంపాక్స్ అనుమానిత లేదా నిర్ధరణ కేసుల కోసం ఢిల్లీలోని మూడు ఆసుపత్రుల్లో ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రపంచ వ్యాప్తంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎంపాక్స్ కేసులు బాగా పెరుగుతున్నాయి. ఇప్పటికే 15,600 కేసులు, 537 మరణాలు నమోదయ్యాయి. మన దేశంలో మార్చి తర్వాత కొత్తగా ఎంపాక్స్ కేసులు నమోదు కాలేదు. కనుక మన దగ్గర వ్యాప్తి తీవ్రత తక్కువేనని ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**ఢిల్లీ ఎయిమ్స్ మార్గదర్శకాలు..**

అత్యవసర విభాగాల్లో ఎంపాక్స్ కేసుల పరీక్షల కోసం ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాట్లు చేసుకోవాలి.జ్వరం, దద్దుర్లు వచ్చిన వారికి, ఎంపాక్స్ నిర్ధరిత బాధితులతో సన్నిహితంగా మెలిగిన వారికి వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలిజ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వెన్నునొప్పి, తీవ్ర చలి, అలసట, చర్మంపై పొక్కులు వంటి లక్షణాలతో వ్యాధి నిర్ధరణ చేయాలి.అనుమానిత కేసులను తక్షణమే ఐసోలేషన్‌లో ఉంచాలి. తద్వారా ఇతరులకు సోకకుండా నివారించవచ్చు. ఎంపాక్స్ అనుమానిత వ్యక్తులను వ్యాధి నిర్ధరణ, చికిత్స కోసం ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఆసుపత్రికి తరలించాలి. రోగులను తరలించేందుకు ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేయాలి. ఎంపాక్స్ అనుమానిత కేసుల విషయంలో ఆరోగ్య కార్యకర్తలు పీపీఈ కిట్లు ధరించాలి.

**ఆందోళన దేనికి?**

మంకీపాక్స్‌లో క్లాడ్-1 (కాంగోబేసిన్ క్లాడ్), క్లాడ్-2 (పశ్చిమ ఆఫ్రికా క్లాడ్) అనే రెండు వేరియంట్లు ఉన్నాయి. వీటిల్లో క్లాడ్-1 తీవ్రమైన ఆరోగ్య సమస్యలను సృష్టిస్తుండగా, క్లాడ్-2 తక్కువ ప్రమాదకరంగా ఉంది. క్లాడ్-1 కారణంగా న్యూమోనియా, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యలు సైతం వస్తాయి. మరణాల రేటు కూడా 1 నుంచి 10 శాతం వరకు ఉంది. దీనిలో శరీరంపై పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు వస్తాయి. క్లాడ్-1 ఐబీ వేరియంట్ వేగంగా వ్యాపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. లైంగిక సంబంధాల కారణంగా ఇది వేగంగా వ్యాపిస్తుంది.

**ఎలా వ్యాప్తి చెందుతుంది?**

నేరుగా తాకడం వల్ల మంకీపాక్స్ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. నోరు, ఇతర అవయవాల నుంచి వచ్చే స్రవాల వల్ల, రోగులు వాడిన దుస్తులు, ఇతర వస్తువుల వినియోగం, పచ్చబొట్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా ఈ వ్యాధి సోకిన జంతువులను తాకడం వల్ల వైరస్ ప్రవేశించవచ్చు.

**లక్షణాలు ఎలా ఉంటాయి?**

ఈ వైరస్ మనిషి శరీరం లోపలికి ప్రవేశించిన తర్వాత 1 - 21 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. జ్వరం, గొంతు ఎండిపోవడం, పొక్కులు, తల నొప్పి, కండరాల నొప్పులు, వెన్ను నొప్పి, నిస్సత్తువ వంటివి ఉంటాయి. ఇవి దాదాపు 2 - 4 వారాలపాటు కొనసాగవచ్చు. ఇది వ్యాధి సోకిన వ్యక్తి రోగ నిరోధక శక్తిపై ఆధారపడి ఉంటుంది.

**టీకాలు ఉన్నాయా?**

ప్రస్తుతం మంకీపాక్స్ నివారణకు 2 రకాల టీకాలు ఉన్నాయి. వీటిని గత వారమే ప్రపంచ ఆరోగ్య సంస్థ స్ట్రాటజిక్ అడ్వైజరీ గ్రూప్ అత్యవసర వినియోగానికి లిస్టింగ్ చేసింది.

# మా సమస్యలను పరిష్కరించండి

- **సీఎం రేవంత్ రెడ్డికి ముస్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ నేతల బృందం వినతి**

**విశ్వంభర, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ లోని పర్మనెంట్ ఉద్యోగులు, అవుట్‌సోర్స్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ముస్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరింది. ఈ మేరకు బుధవారం ఆయనకు యూనియన్ నేతల బృందం వినతి పత్రాన్ని కూడా సమర్పించింది. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో యూనియన్ నేతల బృందం సీఎంను కలిసింది. జీహెచ్ఎంసీ లోని పర్మనెంట్ ఉద్యోగులు, అవుట్‌సోర్స్ , కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఉద్యోగులకు ఆరోగ్య భద్రత లేకపోవడం, ఇప్పటివరకు ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించకపోవడం, కారుణ్య నియామకాల లో జాప్యం జరుగుతున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ త్వరలోనే ఉద్యోగులు కార్మికుల సమస్యల పరిష్కారానికి అనుకూలమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీఎం ను కలిసిన వారిలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, ట్రాన్స్పోర్ట్ విభాగం నాయకుడు మహమ్మద్ రఫీక్, యూనియన్ నేతలు ఎన్ రమేష్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారం కోసం సీఎంను కలిసిన మున్సిపల్ మజ్దూర్ సహకార యూనియన్ నేతల బృందం

## శ్రీశైలంలో భారీ వర్షాలు

### భక్తులకు ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలి : ఈవో



**విశ్వంభర, శ్రీశైలం:** శ్రీశైలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆలయ ఈవో డి పెద్దిరాజు అన్ని విభాగాలను ఆదేశించారు. పరిపాలనా కార్యాలయంలోని సమావేశంలో మందిరంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ కార్యనిర్వహణ అధికారిణి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అన్ని శాఖల అధిపతులు, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. వర్షాల వల్ల పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు తాగే నీటిలో కలవకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా రోడ్లపై వర్షపు నీరు నిలిచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా మ్యాన్‌హోల్స్‌పై బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలు జరగకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ముఖ్యంగా యాత్రికులకు దేవస్థానం డార్మిటరీలందు ఉచిత వసతి కల్పించాలని సూచించారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి యాత్రికులకు తెలిసే విధంగా దేవస్థానం ప్రసార వ్యవస్థ ద్వారా నిరంతరం తగు సూచనలు చేయాలన్నారు. అధికారులందరూ పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని ఈవో ఆదేశించారు.

## ఇద్దరు హైదరాబాద్ శాస్త్రవేత్తలకు నేషనల్ జియో సైన్స్ అవార్డులు

### రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిష్టాత్మక నేషనల్ జియో సైన్స్ అవార్డుకు ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి (కెమికల్ ఇంజనీరింగ్ విభాగం), ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బంటు ప్రసన్న కుమార్ ఎంపికయ్యారు. వీరికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మ మంగళవారం అవార్డులను ప్రదానం చేశారు . కేంద్ర గనుల శాఖ 2023 ఏడాదిగానూ మొత్తం మూడు విభాగాల్లో 12 మందికి నేషనల్ జియో సైన్స్ అవార్డులను సోమవారం ప్రకటించింది. జియో సైన్స్‌లో అసాధారణ విజయాలు, అత్యుత్తమ సహకారం అందించిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి, ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ బంటు ప్రసన్నకుమార్‌కు నేషనల్ జియో సైన్స్ అవార్డులు దక్కాయి. మినరల్ బెనిఫిషియేషన్, సుస్థిర ఖనిజ అభివృద్ధి రంగంలో ప్రొఫెసర్ నరసింహ విశేష కృషి చేశారని, జియోఫిజికల్ ఎక్స్‌ప్లొరేషన్, జియోఫిజికల్ మెథడ్‌ల అప్లికేషన్, జియో-మాగ్నెటిజం, జియోఫిజికల్ సర్వే టెక్నిక్‌లు, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో కొత్త సాంకేతికతను తేవడానికి ప్రసన్నకుమార్ కృషి చేశారని కేంద్రం తెలిపింది.



# ఆయుబ్, షకీల్ అర్ధసెంచరీలు

### తొలి రోజు పాకిస్థాన్ 158/8

**రావల్పిండి:** బంగ్లాదేశ్లో బుధవారం ఆరంభమైన తొలి టెస్టులో పాకిస్థాన్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఓపెనర్ సయీమ్ అయుబ్, సాద్ షకీల్ అర్ధసెంచరీలు నమోదు చేశారు. బంగ్లా బౌలర్లలో షొరిఫుల్ ఇస్లామ్, హసన్ మహమూద్ రెండేసి వికెట్లు పడగొట్టారు. వర్షం కారణంగా ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో తొలి రోజు 41 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. లంచ్ తరువాత ఆట ఆరంభమైంది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ తో పాటు కెప్టెన్ షాన్ మసూద్, మాజీ కెప్టెన్ బాబర్ అజమ్ సింగిల్ డిజిట్ కే వెనుతిరగడంతో పాకిస్థాన్ 16 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి ఇక్కట్లలో పడింది. అయితే ఆయుబ్, షకీల్ సెంచరీ భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. వారిరువురూ నాలుగో వికెట్ కు 98 పరుగులు జోడించారు. ఆయుబ్ అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న తరువాత కొద్దిసేపటికి హసన్ మహ్మూద్ కు వికెట్ సమర్పించుకుని పెవిలియన్ చేరాడు. అనంతరం షకీల్ వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్ తో కలిసి మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు. షకీల్ 57, రిజ్వాన్ 24 పరుగులతో ఆటలో కొనసాగుతున్నారు.

**సంక్షిప్త స్కోర్లు:** పాకిస్థాన్ - 158/4(సయీమ్ ఆయుబ్ 56, సాద్ షకీల్ 57 బ్యాటింగ్, మహ్మద్ రిజ్వాన్ 24 బ్యాటింగ్, షొరిఫుల్ ఇస్లామ్ 2/30, హసన్ మహ్మూద్ 2/33).

# ఐసీసీలో భారతీయుల హవా



## భారత ఐసీసీ చైర్మన్లు

**దుబాయ్:** భారత క్రికెట్నియంత్రణ మండలి(బీసీసీఐ) కార్యదర్శిగా వ్యవహరిస్తున్న జై షా అంతర్జీతీయ క్రికెట్ మండలి చైర్మన్ పదవికి పోటీలో ఉన్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో గతంలో ఐసీసీ చైర్మన్లుగా పనిచేసిన భారతీయుల గురించి తెలుసుకుందాం. ఐసీసీ ప్రస్తుత చైర్మన్ గ్రెగ్ బార్క్లే పదవీకాలం నవంబరు 30తో ముగుస్తుంది. మరోసారి ఎన్నికల బరిలో నిలవకూడదని గ్రెగ్ బార్ క్లే నిర్ణయించుకోవడంతో జై షా ఆ పదవి కోసం పోటీ పడొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఐసీసీ వ్యవహారాల్లో బీసీసీఐది కీలక పాత్ర కావడం, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు మద్దతు జై షాకు ఉండడం వల్ల ఐసీసీ చైర్మన్ పదవికి ఆయనకు అడ్డు ఉండదనే భావిస్తున్నారు. గతంలో నలుగురు భారతీయులు ఈ పదవికి అలంకరించారు. జగ్మోహన్ దాల్మియా తొలి భారత చైర్మన్ కాగా ఆ తరువాత శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ ప్రతిష్ఠాత్మక పదవిని అలంకరించారు. ప్రపంచ క్రికెట్లో ఐసీసీది ప్రత్యేక స్థానం. అందుకే ఐసీసీ చైర్మన్ పదవికి అంతలా పేరు ఉంది. ఐసీసీ చైర్మన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్కు నేతృత్వం వహిస్తారు. ఐసీసీ చైర్మన్ ఎన్నికల్లో మొత్తం 16 ఓట్లు ఉంటాయి. 9 ఓట్లు వచ్చిన వ్యక్తి చైర్మన్ పగ్గాలు అందుకుంటారు. ఇంతకు ముందు చైర్మన్ పగ్గాలు చేపట్టాలంటే మూడింట రెండొంతుల ఓట్లు పొందాలనే నిబంధన ఉండేది. కాగా, షా ఇప్పుడు ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల ఉప సంఘం అధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఓటు హక్కు ఉన్న చాలా దేశాలు షా పట్ల సానుకూలతతో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐసీసీ చైర్మన్గా జై షా బాధ్యతలు చేపట్టడం ఖాయమని అంటున్నారు.

**జగ్మోహన్ దాల్మియా (1997-2000):** భారత్, ఆసియా తరపు న మొదటి ఐసీసీ చైర్మన్గా జగ్మోహ న్ దాల్మియా చరిత్ర సృష్టించారు. దాల్మియా ఈ పదవిలో 1997- 2000 వరకు కొనసాగారు. ఏకగ్రీవంగా ఐసీసీ చైర్మన్గా దాల్మియా ఎన్నికయ్యారు. అంతకుముందు 1996లో ఐసీసీ ఛైర్మన్ పదవి కోసం పోటీ చేసి త్రుటిలో దాన్ని కోల్పోయారు. ఆస్ట్రేలియాకు చెందిన మాల్కం గ్రేపై జగ్మోహన్ దాల్మియా పోటీ చేసి 23 ఓట్లను పొందారు. మాల్కం గ్రేకు 13 ఓట్లే వచ్చాయి. అయినా ఛైర్మన్ పదవి చేపట్టేందుకు ఐసీసీ రూల్స్ ప్రకారం మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు రావాలి. దీంతో జగ్మోహన్ త్రుటిలో ఛైర్మన్ పదవిని కోల్పోయారు.

**శరద్ పవార్ (2010-2012):** భారత దిగ్గజ రాజకీయ నాయకుల్లో శరద్ పవార్ ఒకరు. ఈయన నాలుగుసార్లు మహారాష్ట్రకు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాగే పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ హయాంలో కేంద్ర మంత్రిగా సేవలందించారు. అయితే రాజకీయాల్లోనే కాదు క్రికెట్ లోనూ శరద్ పవార్ చక్రం తిప్పారు. 2005-2008లో పవార్ బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ తర్వాత 2010లో ఐసీసీ ఛైర్మన్గా ఎన్నికయ్యారు. రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగారు.

**ఎన్. శ్రీనివాసన్ (2014-2015):** ఎన్. శ్రీనివాసన్ బీసీసీఐ కార్యదర్శిగా తొలుత ప నిచేశారు. ఆ తర్వాత 2011లో శశాంక్ మనోహర్ నుంచి బీసీసీఐ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. 2014 వరకు శ్రీనివాసన్ ఈ పదవిలో కొనసాగారు. 2014లో ఐసీసీ ఛైర్మన్గా నియమితులయ్యారు. ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగారు.

**శశాంక్ మనోహర్ (2015-2020):** ఐసీసీ ఛైర్మన్గా శశాంక్ మనోహర్ 2015 నుంచి 2020 వరకు కొనసాగారు. ఈ పదవిలో సుదీర్ఘంగా పనిచేసిన భారతీయుడు శశాంక్ మనోహర్. కాగా, శశాంక్ మనోహర్ 1996లో విదర్భ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈయనకు రాజకీయ నాయకుడు, ఐసీసీ మాజీ ఛైర్మన్ శరద్ పవార్ తో బలమైన సంబంధాలు ఉన్నాయి. దీనితో 2008లో శశాంక్ తొలిసారి బీసీసీఐ అధ్యక్షుడు అయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆ సమయంలోనే ఐపీఎల్ కు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడు జగ్మోహన్ దాల్మియా హఠాన్మరణంతో 2015లో శశాంక్ మరోసారి బీసీసీఐ అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. ఆ ఏడాదిలోనే ఐసీసీ ఛైర్మన్ పదవిని స్వీకరించారు.



# వరల్డ్ కప్ ట్రోఫీకి ప్రత్యేక పూజలు

**ముంబయి:** పొట్టి ప్రపంచ కప్ విజయంతో భారత జట్టు 14 ఏండ్ల నిరీక్షణకు తెరపడింది. బార్బడోస్ వేదికపై సగర్వంగా ట్రోఫీని అందుకున్న టీమిండియా యావత్ భారతావనిని పులకింపజేసింది. మెన్ ఇన్ బ్లూకు ఇది రెండో టీ20 వరల్డ్ కప్ ట్రోఫీ కాగా.. మొత్తంగా నాలుగో వరల్డ్ కప్. అందుకని ఈ ట్రోఫీకి భారత కెప్టెన రోహిత్ శర్మ (Rohit Sharma) ప్రత్యేక పూజులు చేయించాడు. అది కూడా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాకుడి ఆలయంలో. భారత కెప్టెన్ రోహిత్, బీసీసీఐ సెక్రటరీ జై షా(Jai Shah) లు ముంబైలోని బుధవారం సిద్ధి వినాయకుడి (Sidhdi Vinayaka)ని దర్శించుకున్నారు. తమ వెంట తీసుకొచ్చిన ఆ వరల్డ్ కప్ ట్రోఫీని రోహిత్, షాలు విఘ్నేశ్వరుడి సన్నిధిలో పెట్టారు. దాంతో, అక్కడి అర్చకులు ప్రపంచ కప్ ట్రోఫీకి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం గణనాధుని కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ భారత జట్టుపై ఉండాలని రోహిత్, షాలు ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు టీమిండియా సారథి, షాలను గులాబీ రంగు షాలువాలతో సన్మానించారు. ముంబైలోని సిద్ధి వినాయక దేవాలయం ఎంత పాపులరో తెలిసిందే. దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశీయులు కూడా ఈ గుడిని సందర్శించి పులకించిపోతారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరొందిన సిద్ధి వినాయకుడి అంటే భారత్లోని పలువురు వ్యాపారవేత్తలు, బాలీవుడ్ తారలు, క్రికెటర్లకు ఓ సెంటిమెంట్.

# నాలుగింతలు పెరిగిన వినేశ్ బ్రాండ్ విలువ



పారిస్ ఒలింపిక్స్తో సంచలనంగా మారిన భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్ బ్రాండ్ వాల్యూ నాలుగింతలు పెరిగింది. ఇంతకుముందు అంబాసిడర్గా రూ.25 లక్షలు తీసుకునే ఆమె విశ్వ క్రీడల తర్వాత ఏకంగా కోటి రూపాయలు డిమాండ్ చేస్తోందట. ఈ విషయాన్ని బుధవారం ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. 'పారిస్ వెళ్లడానికి ముందు వినేశ్ ఒక బ్రాండ్ ప్రకటనలో నటించేందుకు రూ. 25 లక్షలు అడిగేది. ఇప్పుడు ఆమె తన ఫీజును రూ.75 లక్షల నుంచి రూ.1 కోటికి పెంచింది' అని తెలిపింది. పారిస్లో రజతంతో మెరిసిన నీరజ్ చోప్రా బ్రాండ్ ధర కూడా 30 నుంచి 40 శాతానికి పెరిగింది. ప్రస్తుతం అంబాసిడర్గా అతడు రూ.330 కోట్లు ఆర్జిస్తున్నాడు.

**నీరజ్ చోప్రా, మను భాకర్...**

విశ్వ క్రీడల్లో రెండు కాంస్యాలతో చరిత్ర సృ-ష్టించన మను భాకర్ సైతం పలు ప్రకటనలకు ఓకే చెప్పింది. ఆమె ఒక్కో యాడ్కు రూ.25 లక్షలు డిమాండ్ చేస్తోందని సమాచారం. ఒలింపిక్స్లో పతకం పోయిన బాధతో స్వదేశం వచ్చిన వినేశ్ వీడ్కోలుపై పునరాలో-చన చేయనుంది. లాస్ ఏంజెల్స్లో పతకమే లక్ష్యంగా ఆమె బరిలోకి దిగే అవకాశముంది.

# సిన్సినాటి ఓపెన్ చాంపియన్లు సిన్నర్, సబలెంక



**సిన్సినాటి:** ప్రపంచ నంబర్ వన్ జానిక్ సిన్నర్, బెలారస్ కు చెందిన అరినా సబలెంక సిన్సినాటి ఓపెన్ టెన్నిస్ చాంపియన్ షిప్ లో విజేతలుగా నిలిచారు. పురుషుల సింగిల్స్ లో సిన్నర్ ఫ్రాన్స్ కు చెందిన ఫ్రాన్సెస్ టియాఫొను వరుస సెట్లలో 7-6. 6-2 స్కోరుతో మట్టికరి-పించాడు. యుఎస్ ఓపెన్ కు ముందు ఈ విజయం సిన్నర్ కు ఆత్మ విశ్వాసం పెం-పొందించేదే. మహిళల సింగిల్స్ ఫైనల్లో మూడో సీడ్ సబలెంక 6-3, 7-5 స్కోరుతో ఆరో సీడ్ జెస్సికా పెగ్యులాపై గెలుపొంది ట్రోఫీని దక్కించుకుంది. సబలెంక 10 ఏస్ లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేయగా, పెగ్యులా అయిదు ఏస్ లు, అయిదు డబుల్ ఫాల్ట్ లతో ఓటమి పాలయింది.

# శ్రీజేష్ కు రూ.2 కోట్ల పురస్కారం

### ప్రకటించిన కేరళ ప్రభుత్వం



**తిరువనంతపురం :** పారిస్ ఒలింపిక్స్ లో హాకీ కాంస్యాన్ని అందుకుని తన సుదీర్ఘ కెరీర్ కు వీడ్కోలు పలికిన సీనియర్ గోల్ కీపర్ ఆర్.పి.శ్రీజేష్ కు కేరళ ప్రభుత్వం రూ.2 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పునరయి విజయన్ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. భారత హాకీ జట్టు సభ్యుడు, పారిస్ ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించిన శ్రీజేష్ కు రెండు కోట్ల రూపాయలు బహుమతిగా ప్రకటిస్తున్నట్టు కేరళ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. కేరళకు చెందిన శ్రీజేష్ 2004లో జాతీయ జూనియర్ జట్టుకు, అనంతరం సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 20 ఏళ్లలో శ్రీజేష్ 336 మ్యాచ్ లలో భారత్ కు ప్రాతినిధ్యం వహించాడు. అతడి ఖాతాలో రెండు ఒలింపిక్ కాంస్యాలతోపాటు రెండు ఆసియా క్రీడల స్వర్ణాలు, రెండు కామన్వెల్త్ రజతాలు, రెండు ఛాంపియన్ ట్రోఫీ రజతాలు ఉన్నాయి.



### ప్రపంచంలోనే అత్యుత్తమ సెంట్రల్ బ్యాంక్

# గవర్నర్గా శక్తికాంత దాస్

### రెండోసారి ఎన్నిక.. ప్రధాని మోదీ ప్రశంస

**విశ్వంభర, బిజినెస్:** ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వరుసగా రెండోసారి ప్రపంచంలోనే అత్యుత్తమ సెంట్రల్ బ్యాంకర్గా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. యూఎస్కు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఇచ్చిన ర్యాంకుల్లో ఆయనకు నెంబర్ వన్ ప్లేస్లో నిలిచారు. గ్లోబల్ ఫైనాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్ ప్రకారం.. ఈ ఏడాది శక్తికాంత దాస్కు ఏ ప్లస్ రేటింగ్ లభించిందని ఆర్బీఐ సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఏ ప్లస్ రేటింగ్ను ముగ్గురు సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లకు ఇవ్వగా.. అందులో దాస్ అగ్రస్థానం పొందారని పేర్కొంది. ద్రవ్యోల్బణం, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక స్థిరత్వం, వడ్డీరేట్ల నిర్వహణ ఆధారంగా సెంట్రల్ బ్యాంకుల గవర్నర్లకు ఏ నుంచి ఎఫ్ వరకు గ్రేడ్లను కేటాయించగా.. అద్భుతమైన పనితీరుకు ఏ, అధ్వాన్న పనితీరు కనబరిచిన వారికి ఎఫ్ రేటింగ్ ఇచ్చారు. కాగా శక్తికాంతదాస్ సామర్థ్యానికి ఇది చిహ్నమని ప్రధాని మోదీ కొనియాడారు. శక్తికాంత దాస్తో పాటు డెన్మార్క్కు చెందిన క్రిస్టియన్ కెటెల్ థామ్సన్, స్విట్జర్లాండ్ గవర్నర్ థామస్ జే జోర్డాన్ ఏ ప్లస్ రేటింగ్ను సాధించిన వారిలో ఉన్నారు. గ్లోబల్ ఫైనాన్స్ వార్షిక సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్ బ్యాంకర్లను గౌరవిస్తుంది. వ్యూహాలు వాస్తవికత, సృజనాత్మకత, పట్టుదల ఆధారంగా రేటింగ్స్ ఇస్తుంది. ఆయా గవర్నర్ల ద్వారా సమిష్టి కృషితో ప్రపంచవ్యాప్తంగా దేశాల్లో ద్రవ్యోల్బణ రేటును గణనీయంగా తగ్గించడంలో సహాయపడిందని పేర్కొంది. గ్లోబల్ ఫైనాన్స్ 1994 నుంచి ఏటా సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్ ప్రచురిస్తుంది. యూరోపియన్ యూనియన్, ఈస్టర్న్ కరేబియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ సెంట్రల్ ఆఫ్రికన్ స్టేట్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్తో సహా దాదాపు 100 దేశాలు సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లను గ్రేడ్ చేస్తుంది.

### నెలవారీ రీఛార్జ్లతో విసిగిన వారి కోసం

# బీఎస్ఎన్ఎల్ అద్భుత వార్షిక ప్లాన్

BSNL
Connecting India Faster

**న్యూఢిల్లీ:** బీఎస్ఎన్ఎల్ త్వరలోనే దేశవ్యాప్తంగా 4G సేవలను ప్రారంభించబోతోంది. ప్రభుత్వ టెలికాం కంపెనీ తన 4జి నెట్వర్క్ను కొన్ని టెలికాం సర్కిల్లలో ఇప్పటికే ప్రత్యక్ష ప్రసారం చేసింది. మరో రెండు, మూడు నెలల్లో కంపెనీ దేశవ్యాప్తంగా 4జి సేవలను ప్రారంభించవచ్చు. నెట్వర్క్ అప్గ్రేడ్తో పాటు కంపెనీ ఇప్పటికే అన్ని ప్రైవేట్ టెలికాం కంపెనీలకు గట్టి పోటీ ఇవ్వడం ప్రారంభించింది. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఇటీవల అనేక రీఛార్జ్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఇవి ప్రైవేట్ కంపెనీల కంటే ఎక్కువ ప్రయోజనాలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు 365 రోజుల చెల్లుబాటుతో చౌకైన ప్లాన్ను ప్రకటించింది.

**రూ. 2,999 రీఛార్జ్ ప్లాన్**

- బీఎస్ఎన్ఎల్ రూ. 2,999 ఏడాది రీఛార్జ్ ప్లాన్ ను ప్రకటించింది
- ఈ ప్లాన్ లో అపరిమిత లోకల్, ఎస్ టిడి, రోమింగ్ కాల్లను అందిస్తున్నారు
- ఇది ఏడాది పొడవునా నిరంతరాయ సేవలను అందిస్తుంది
- ఆన్లైన్, స్ట్రీమింగ్, ఎంటర్టైన్మెంట్ కావాలనుకునే వారికి ఇది బెస్ట్ ప్లాన్ అని చెప్పవచ్చు
- దీనిలో వినియోగదారులకు రోజుకు 3జిబి హై స్పీడ్ డేటా లభిస్తుంది
- రోజువారీ డేటా పరిమితిని చేరుకున్న తర్వాత వేగం 40 కెబిపిఎస్ కి తగ్గించబడుతుంది
- ఈ వార్షిక ప్లాన్లో రోజుకు 100 ఎస్ ఎం ఎస్ లు ఉంటాయి. ముంబై, ఢిల్లీ ఎంటిఎన్ఎల్ ప్రాంతాల్లో 395 రోజులపాటు చెల్లుబాటు అవుతుంది
- డేటా వినియోగదారులకు ఇది అనుకూలమైన ప్రయోజనాలను అందిస్తుంది

రూ. 1499 ప్లాన్ ఇది కాకుండా బీఎస్ఎన్ఎల్ 365 రోజుల చెల్లుబాటుతో మరో ప్లాన్ కూడా అందుబాటులో ఉంది. ఇది రూ. 1499కి వస్తుంది. ఈ ప్లాన్లో దేశవ్యాప్తంగా ఏ నెట్వర్క్లోనైనా కాల్స్ చేయడానికి వినియోగదారులకు అపరిమిత ఉచిత కాలింగ్ అందించబడుతుంది. ఈ ప్లాన్ ద్వారా ప్రతిరోజూ 100 ఉచిత ఎస్ఎంఎస్ లు లభిస్తాయి. దీంతోపాటు ఈ ప్లాన్లో వినియోగదారులకు ప్రతి నెలా 24జిబి డేటా అందించబడుతుంది. వినియోగదారులు రోజువారీ పరిమితి లేకుండా ఉపయోగించుకోవచ్చు. అయితే డేటా ప్లాన్ అవసరం లేదనుకున్నవారికి ఇది బెస్ట్ అని చెప్పవచ్చు.

**మరిన్ని బీఎస్ఎన్ఎల్ ప్లాన్లు**

బీఎస్ఎన్ఎల్ విభిన్న శ్రేణి ప్లాన్లను అందిస్తోంది. వీటిలో తక్కువగా రూ.11 నుంచి మొదలై రూ. 3,000 వరకు ఉన్నాయి. మీ అవసరాలకు బాగా సరిపోయే ప్లాన్ను తెలుసుకోవడానికి మీరు బీఎస్ఎన్ఎల్ అధికారిక వెబ్సైట్ను సందర్శించి ఆయా ఆఫర్ల గురించి తెలుసుకోవచ్చు. ప్రస్తుతం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ప్రైవేట్ టెలికాం సర్వీస్ ప్రొవైడర్లకు గట్టి పోటీని ఇస్తూ అందుబాటు ధరల్లో రీఛార్జ్ ప్లాన్లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. బీఎస్ఎన్ఎల్ ఇటీవల రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా (విఐ), ఎయిర్టెల్ వంటి ఇతర టెలికాం ప్లేయర్ల నుంచి పోటీకి నిలబడగలిగే మంచి ప్లాన్లను ప్రకటించింది.

# ఓఎన్జీసీకి మరో అధునాతన రిగ్

**హైదరాబాద్:** మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈ-ఐఎల్) ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్స్ మార్కెట్లో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని ఓఎన్జీసీకి మరో అధునాతన ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్ను సరఫరా చేసింది. అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన ఈ ఫుల్లీ ఆటోమేటెడ్, హైడ్రాలిక్ 2000 హెచ్పీ రిగ్ను ఓఎన్జీసీ రాజమండ్రి ప్రాంతంలో చమురు, సహజ వాయువు అన్వేషణకు ఉపయోగించనుంది. తీవ్రమైన ఒత్తిడి, ఉష్ణోగ్రతల్లోనూ ఈ డ్రిల్లింగ్ రిగ్ సాయంతో 6,000 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేయవచ్చు. చమురు, సహజవాయువు కోసం డ్రిల్లింగ్ చేసేట-ప్పుడు ఏర్పడే బ్లోఅవుట్స్ను అదుపు చేసేందుకూ ఈ రిగ్లో ప్రత్యేక ఏర్పాటు ఉందని ఎంఈఐఎల్ తెలిపింది. కేవలం ఇద్దరి సహాయంతో ఈ రిగ్ను ఆపరేట్ చేయడం మరో ప్రత్యేకత. ఆత్మనిర్భర్ భారత్ కింద ఎంఈఐఎల్ ఈ అధునాతన రిగ్లను తయారు చేస్తోంది. అంతర్జాతీయ పోటీని తట్టుకుని ఓఎన్జీసీకి మొత్తం 47 డ్రిల్లింగ్ రిగ్లు సరఫరా చేసే కాంట్రాక్టును ఎంఈఐఎల్ దక్కించుకుంది.

# లక్షకుపైగా కార్లు వెనక్కి

**న్యూఢిల్లీ :** కియా, టెస్లాతోపాటు మరో రెండు కార్ల కంపెనీలు లక్షకు పైగా కార్లను వెనక్కి తీసుకోనున్నాయి. ఆయా కంపెనీల కార్లలో లోపాల కారణంగా కంపెనీలు వాటిని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఈ విషయాన్ని దక్షిణకొరియా రవాణా మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. కార్లను రీకాల్ చేస్తున్న నాలుగు కంపెనీల్లో టెస్లా, కియాతోపాటు ఫోర్డ్ మోటార్, జీఎం ఏసియా పసిఫిక్ కూడా ఉన్నాయి. నాలుగు కంపెనీలకు సంబంధించిన ఏడు మోడల్స్లో 1,03,543 కార్లలో లోపాలు ఉన్నట్లు ఆయా కంపెనీలు గుర్తిం-చాయి. టెస్లా కంపెనీ కార్లలోని మోడల్ వై లో సాఫ్ట్వేర్ లోపం ఉందని నిర్ధా-రణ అయ్యింది. కియా ప్రైడ్ కాంపాక్ట్ కారులోని హైడ్రాలిక్ ఎలక్ట్రిక్ కంట్రోల్ యూనిట్లో డ్యూరెబిలిటీ లేకపోవడంతో వెనక్కి తీసుకుంటున్నారు. అదేవి-ధంగా ఫోర్డ్ కంపెనీకి చెందిన లింకన్ ఎంకెఎక్స్ ఎస్ యువి కారులో బ్రేక్ బూస్టర్లో లోపం ఉంది. జీఎం ఏసియా పసిఫిక్ కంపెనీకి చెందిన కాడిలాక్ లిరిక్ ఆల్ ఎలక్ట్రిక్ సెడాన్ కారులో ఎలక్ట్రిక్ బ్రేక్ కంట్రోల్ మాడ్యూల్లో సమస్య ఉంది. వాహన యజమానులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కార్.గో.కెఆర్ వెబ్సైట్ ద్వా-రాగానీ, 080-357-2500 నెంబర్కు కాల్ చేయడం ద్వారాగానీ తమ కారు రీకాల్ లిస్టులో ఉందో.. లేదో తెలుసుకోవచ్చని దక్షిణ కొరియా రవాణా మం-త్రిత్వ శాఖ సూచించింది. ఈ నెల ఆరంభంలో కూడా బీఎండబ్ల్యూ కొరియా, హుందాయ్ మోటార్, రెండు ఇతర కంపెనీలు తయారీ లోపాల కారణంగా స్వచ్ఛందంగా 1,72,000 వాహనాలను వెనక్కి తీసుకున్నాయి.

# టాలెంట్‌కు వేదికగా సోషల్ మీడియా



## ఇమాన్వీ ఎంపికపై హను రాఘవపూడి

ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా కోసం కథానాయికగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ ఎస్మాయిల్‌ను చిత్రబృందం ఎంపిక చేసింది. ఈ సినిమాలో కథానాయికగా ఆమెను ఎంచుకోవడంపై దర్శకుడు హను రాఘవపూడి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వల్ల కొత్త టాలెంట్‌ను వెతికి పట్టుకోవడం సులభ మైందన్నారు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో కొత్త టాలెంట్‌ను వెలికితీయడంలో సామాజిక మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తమ కథకు అనుగుణంగా నటీనటులను ఎంపిక చేసుకోవడంలో ఫిల్మ్‌మేకర్స్‌కు సోషల్‌మీడియా ఎంతో సాయం చేస్తుంది. ఇమాన్వీ అందం, ప్రతిభ కలిగిన అమ్మాయి. అందరిలాగానే నేనూ ఆమె డ్యాన్స్ వీడియోలు చూస్తుంటా. ఆమె మంచి భరతనాట్యం డ్యాన్సర్. కళ్లతోనే ఎన్నో హావభావాలను పలికిస్తుంటుంది. అందుకే ఆమెకు ఒక అవకాశం ఇవ్వాలనుకున్నా అని హను చెప్పారు. ఆడిషన్స్, స్క్రీన్ టెస్ట్ అనంతరమే ఆమెను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆమెను సెలెక్ట్ చేయడం తన ఒక్కడి నిర్ణయం కాదని.. చిత్రబృందం మొత్తం నిర్ణయమని ఆయన తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితం కానుంది. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇమాన్వీ విషయానికి వస్తే.. ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌గా ఆమె యువతకు సుపరిచితురాలు. హిందీతో పాటు, తెలుగు, తమిళ పాటలకూ ఆమె వేసే స్టెప్‌లు ఎంతగానో అలరిస్తాయి. దాదాపు 7 లక్షల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా ప్రకటించిన తర్వాత ఆ సంఖ్య మరింత పెరిగింది.





## రాముడి పాత్రధారికి ప్రశాంత చిత్తం అవసరం

నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'రామాయణ' పేరుతో ఇది రానుంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ రాముడిగా కనిపించనున్నారు. అయితే, రాముడిగా ఈ హీరోనే ఎంపిక చేసుకోవడంపై తాజాగా బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాముడి పాత్ర పోషించాల్సినవారికి ఉండాల్సిన ప్రధాన లక్షణం ప్రశాంతత. రణ్‌బీర్ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. అందుకే నితేశ్ తివారీ అందరికంటే అతడిని ముందుగా ఎంపిక చేశారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపిక సరైనదని సినిమా చూశాక ప్రేక్షకులకు కచ్చితంగా అర్థమవుతుంది. నేను రణ్‌బీర్‌తో కలిసి చాలా ప్రాజెక్ట్‌లకు వర్క్ చేశాను. నటనలో ఆయనతో ఎవరూ పోటీ పడలేరు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలా ఉంటాడు' అంటూ రణ్‌బీర్‌పై ముఖేశ్ ప్రశంసలు కురిపించారు. ఇందులో అగ్రనటీనటులు భాగం కానున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో సీతగా సాయి పల్లవి , రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మూడు భాగాలుగా దీన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. మొదటి పార్ట్‌ను 2025 దీపావళికి తీసుకురావాలని ఎలాన్ చేస్తున్నారు. ఇక దీని వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌ల కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్ఈజీ (ఆఔఇఉ)తో సంప్రదింపులు జరిపిందట. ఈ సినిమాకు తెలుగు వెర్షన్ సంభాషణలు రాసే బాధ్యతను చిత్ర బృందం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కు అప్పగించినట్లు సమాచారం.

## కథకు తగ్గ పాత్రను చేయడం ఇష్టం: శ్రీనిహ

చిత్రపరిశ్రమలో ఎంతో మంది ప్రతిభ కలిగిన నటీనటులున్నారని, అలాంటి వారికి సినిమాల్లో అవకాశాలు రాకపోవడం ఎంతో బాధగా ఉందని యువ నటి శ్రీనిహ అన్నారు. '50-50' చిత్రంలో హీరోయిన్ చెల్లెలి పాత్ర ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన శ్రీనిహ 'ఆణ్ దేవతై', 'సైకో', హీరో సంతానం నటించి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'ఇంగే నాంగ దాన్ కింగు' వంటి చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించింది. ప్రస్తుతం '8 తోట్టాగల్' ఫేం వెట్రి, సీనియర్ నటుడు సత్యరాజ్ ప్రధాన పాత్ర లో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ జానర్ మూవీలో కీలక పాత్ర పోషిస్తుంది. హీరోయిన్‌గా నటించడానికి అన్ని రకాల అర్హతలున్నప్పటికీ ఆమెకు కేవలం చిన్నచిన్న పాత్రలకే పరిమితమైంది. ఈ క్రమంలో ఇప్పటివరకు తన సినీ ప్రయాణంపై ఆమె స్పందిస్తూ, 'కంటెంట్ బాగుంటే ఎలాంటి పాత్ర అయినా పోషించేందుకు సిద్ధంగా ఉన్నాను. నృత్య శిక్షణ సమయంలో ఉన్నప్పుడు తొలిసారి మోడలింగ్‌లో అవకాశం రావడంతో అంగీకరించి అప్పటినుంచి అనేక వాణిజ్య ప్రకటనలో నటించానని తెలిపింది. తర్వాత సినిమాల్లో నటించే అవకాశం వరించిందరని, దర్శక ద్వయం జేడీ-జెర్రీలతో కలిసి పనిచేశానుని తెలిపింది. అయితే ఆ తరహా ఒకే తరహా, గ్లామర్ ఎక్స్‌పోజింగ్ పాత్రలు వరుసగా వస్తుండటంతో వాటిని నిరాకరించానని పేర్కొంది. కథ డిమాండ్ చేస్తే గ్లామర్‌గా నటించడంలో తప్పులేదనీ, కేవలం సినిమా కోసం గ్లామర్‌గా నటించడం ఇష్టం లేదు. వైవిధ్యభరితమైన పాత్రల్లో నటించాలన్నది నా కోరిక. సంతానంతో కలిసి నటించడం మంచి అనుభవం. ఆయన నన్ను కోలీవుడ్ ప్రియాంకా చోప్రాగా వర్ణించడం మరిచిపోలేని అనుభూతి. తమిళ చిత్రపరిశ్రమలో కేవలం హీరోయిన్ పాత్రలకు మాత్రమే కాకుండా, ఇతర పాత్రలకు కూడా తమిళ కళాకారులకు అవకాశాలివ్వాలన్నారు. విలన్‌తో సహా అన్ని రకాల పాత్రలు పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆమె పేర్కొన్నారు.

## పుష్ప-2 పై రూమర్స్ కంటిన్యూ...



ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం పుష్ప-2 క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. పుష్పరాజ్‌గా మొదటిపార్ట్‌తో అల్లు అర్జున్ తన నటనతో, సుకుమార్ తన టేకింగ్‌తో ఎంతటి సన్సేషన్ సృష్టించారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచి రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రం నుంచి ఇప్పటి వరకు వచ్చిన రెండు సాంగ్స్ చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. అంతేకాదు ఈ సినిమా నుంచి వదిలిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు కూడా అనూహ్య స్పందన వచ్చింది. మొదటగా ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేద్దామనుకున్నారు. అయితే చిత్రీకరణ బ్యాలెన్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పెండింగ్‌గా వుండటంతో డిసెంబర్ 6కు చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇక అప్పటి నుంచి ఈ చిత్రంపై పలు రూమర్స్ వస్తున్నాయి, అల్లు అర్జున్, సుకుమార్‌ల మధ్య గొడవలు, ఈ సినిమా మళ్లీ వాయిదా వేస్తారు. సమ్మర్‌కు రిలీజ్ చేశారు. ఇలా రకరకలా ఊహగానలు ఈ చిత్రంపై వున్నాయి. అంతేకాదు మెగాస్టార్ ఫ్యామిలీకి, అల్లు ఫ్యామిలీకి మనస్పర్థలు వచ్చాయని అల్లు అర్జున్ తన ఫ్రెండ్ కోసం వైసీపీ అభ్యర్థిని సపోర్ట్ చేయడంతో బన్నీని మెగా క్యాంప్ దూరం పెట్టిందని ఇలా రకరకాల ప్రచారాలు వున్నాయి. అయితే ఇవన్నీ అసత్య ప్రచారాలన్నీ పలు సార్లు మెగాస్టార్ కాంపౌండ్, అల్లు ఫ్యామిలీ వాళ్లు చెప్పినా.. రూమర్స్ ఆగడం లేదు.



## కోలీవుడ్‌లోనూ క్యాస్టింగ్ కౌచ్

### మీడియా సమక్షంలో సనమ్ శెట్టి ఆవేదన



క్యాస్టింగ్ కౌచ్ అంశం వెలుగులోకి వచ్చి బాగా చర్చనీయాంశం అవుతుంది. తాజాగా ఇప్పుడు తమిళ నటి, బిగ్ బాస్ బ్యూటీ సనమ్ శెట్టి కోలీవుడ్‌లోనూ క్యాస్టింగ్ కౌచ్ ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. దర్శక నిర్మాతల నుంచి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రెస్‌మీట్ పెట్టి మరీ వాపోయింది. టెక్నికల్‌గా సమాజం ఎంత మారినా, మహిళలు ఎన్ని ఉన్నత చదువులు చదివినా అన్ని రంగాల్లోనూ మహిళలకు వేధింపులు తప్పట్లేవన్నారు. ఇటీవలే మలయాళ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌పై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక గురించి తెలిసి నేను షాకయ్యానని.. అక్కడ ఉన్న అదేవిధమైన పరిస్థితులు తమిళ చిత్ర పరిశ్రమలోనూ ఉన్నాయని పేర్కొంది. ఇక్కడ జరుగుతున్న అకృత్యాలను బయటపెట్టడానికి ఎవరూ ముందుకురారని.. నేనూ ఇలాంటి చేదు సంఘటనలు ఎదుర్కొన్నా అన్నారు.ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు.. ఎందుకు మాట్లాడారని చాలామంది అడుగుతున్నారన్నారు. దీంతో అప్పటి పరిస్థితుల రీత్యా కొన్నిసార్లు బయటకువచ్చి మాట్లాడలేక పోతున్నామని సనమ్ తెలిపింది. అయితే.. కొద్ది రోజుల క్రితం కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఉదంతం అనంతరం సనమ్ షెట్టి తన సోషల్ మీడియా వేదికగా వరలక్ష్మి వత్రం సందర్భంగా ఓ వివాదాస్పద వీడియోను షేర్ చేసింది. మహాలక్ష్మి దేవి పూజను అందరూ జరుపుకుంటున్నామని.. కానీ మన మధ్య నడిచే దేవతలు అత్యాచారానికి, హత్యలకు గురవుతారని, ప్రాణాలు కాపాడే దేవదూత లాంటి ఓ డాక్టర్‌ను అనాగరికంగా హత్య చేస్తే.. కోల్‌కతాలో రీలకెయిమ్ ది నైట్ అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. నేను దానిని చెన్నైలో క్లెయిమ్ ది నైట్‌గా ప్రారంభించాలనుకుంటున్నా అన్నారు. ఈ నిరసనలో నాతో కలిసి బాధితురాలికి న్యాయం చేయడంలో సాయం చేయాలని కోరుతున్నానని శెట్టి ఈ సందర్భంగా తెలిపారు. అంతేకాక ఓ ఆడపిల్ల అనుమతి లేకుండా తాకడానికి ఎవరికీ అధికారం లేదన్నారు. తాను ఓ నటిని, ఎంటర్‌టైన్ చేయడమే నా వృత్తి అలాగని ఆఫర్ల కోసం శరీరాన్ని అమ్ముకోనంటూ సనమ్ శెట్టి సంచలన వాఖ్యలు చేసింది. దీంతో సనమ్ వాఖ్యలపై ఇప్పుడు సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ పెడుతూ ట్రోల్ చేస్తున్నారు. ఆమె దృష్టిలో అవకాశాలు లభించిన హీరోయిన్స్ అంతా శరీరాలను సమర్పించుకున్నారా అంటూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇదిలాఉండగా 2012లో తమిళంలో వచ్చిన అంబులి అనే సినిమాతో కథానాయికగా అరంగేట్రం చేసిన ఈ మిస్ సౌత్ ఇండియా సనమ్ శెట్టి ఆ తర్వాత తమిళంలో పాతిక సినిమాల వరకు చేసింది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com